విలేకరులు కావలెను

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల
వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను
Cell: 9247819181
8309605189

మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA

EPAPER.MANAVAARTHA.NET
MANA VAARTHA

Telangana | సంపుటి: 1, సంచిక: 105 | volume: 1, Issue:105 | గురువారం 13 నవంబర్ 2025 పేజీలు : 8 వెల : 3.00

## మళ్లీ చర్చలోకి ప్రధాని మోదీ డిగ్రీ వివాదం

- **ఢిల్లీ యూనివర్సిటీకి హైకోర్టు మూడు వారాల గడువు...**
- **సీఐసీ ఆదేశాలపై అప్పీలు, జనవరి 16న తదుపరి విచారణ...**
- **పారదర్శకత, ప్రజా ఆసక్తిపై వాదనలు మళ్లీ వేడెక్కనున్నాయి...**

**న్యూఢిల్లీ,** ప్రధాని నరేంద్ర మోదీ విద్యా అర్హతలపై కొనసాగుతున్న చట్టపరమైన వివాదం మరోసారి దేశ దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రధాని మోదీ బ్యాచిలర్ డిగ్రీ వివరాలను బహిర్గతం చేయాలన్న పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టు ఈరోజు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో తమ



అభ్యంతరాలను సమర్పించడానికి ఢిల్లీ యూనివర్సిటీకి మూడు వారాల గడువు ఇచ్చింది. చీఫ్ జస్టిస్ దేవేందర్ కుమార్ ఉపాధ్యాయ్, జస్టిస్ తుషార్ రావు గేదెలతో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు వెలువరించింది. ఆగస్టులో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై వేసిన అప్పీల్ ఆలస్యం అవుతున్నదని కోర్టు గమనించింది. ఢిల్లీ యూనివర్సిటీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఈ కేసుపై తదుపరి విచారణను 2026 జనవరి 16వ తేదీకి వాయిదా వేసినట్లు హైకోర్టు ప్రకటించింది. సీఐసీ ఆదేశాలపై వివాదం ప్రధాని మోదీ డిగ్రీ వివరాలను బహిర్గతం చేయాలన్న సెంట్రల్ ఇన్ఫర్మేషన్ కమిషన్ (CIC) ఆదేశాలను ఆగస్టు 25న సింగిల్ జడ్జి పక్కనపెట్టారు. ఆ తీర్పును సవాల్ చేస్తూ మొత్తం నాలుగు అప్పీలు హైకోర్టులో దాఖలయ్యాయి. ఆర్టీఐ కార్యకర్త నీరజ్, ఆమ్ ఆద్మీ పార్టీ నేత సంజయ్ సింగ్, అడ్వకేట్ మొహమ్మద్ ఇర్షద్‌ల పిటిషన్లను ధర్మాసనం ప్రస్తుతం విచారిస్తోంది. పారదర్శకత వర్సెస్ వ్యక్తిగత హక్కులు ఆగస్టు తీర్పులో సింగిల్ జడ్జి "ప్రజా ఆసక్తికన్నా పారదర్శకత ముఖ్యమైనదే కాని, వ్యక్తిగత సమాచారాన్ని బహిర్గతం చేయడం వల్ల సెన్సేషన్ సృష్టించడం ఉద్దేశం కాదు" అని వ్యాఖ్యానించారు. అయితే, ఆర్టీఐ కార్యకర్తల వాదన ప్రకారం, ప్రధానమంత్రి వంటి ప్రజాప్రతినిధుల విద్యార్హతలు ప్రజలకు తెలియాల్సిన అంశమని అంటున్నారు. 2016 డిసెంబర్ 21న సీఐసీ, 1978లో బీఏ పాసైన వారి రికార్డులను పరిశీలించాలన్న ఆదేశాలు జారీ చేయగా, అదే ఏడాది మోదీ తన డిగ్రీ పూర్తిచేసినట్లు రికార్డుల్లో ఉంది.

## మత్స్యకారుల ఆదాయం పెంపే లక్ష్యం



- ప్రజా చెరువుల్లో చేప పిల్లల పంపిణీ ప్రారంభం...
- సూర్యాపేటలో చేప పిల్లలను విడిచిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి...
- ఉపాధి, ఉత్పత్తి రెండింటినీ పెంచే ప్రభుత్వ యత్నం...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపల ఉత్పత్తి పెంపు, మత్స్యకారుల ఆదాయం అభివృద్ధి లక్ష్యంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని 100 శాతం ఉచితంగా చేపట్టింది. ఈ కార్యక్రమం భాగంగా రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూర్యాపేట జిల్లా పునుగొడుచెరువులో చేప పిల్లలను విడిచారు. రాష్ట్రంలోని ప్రజా చెరువుల్లో చేప పిల్లల విత్తనం ఉచితంగా పంపిణీ చేయడం ద్వారా చేపల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుంది. మత్స్యకారుల ఆదాయం, ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తాయి" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం మత్స్యకార సమాజాల జీవనోపాధిని బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని అన్నారు.- ప్రజా చెరువుల వినియోగానికి ప్రాధాన్యం... రాష్ట్రంలోని అన్ని ప్రజా చెరువులు చేపల పెంపుకు అనుకూలంగా ఉండేలా ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక రూపొందించినట్లు మంత్రి వివరించారు. "చెరువుల ఆధారంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలపరచడమే ప్రభుత్వ లక్ష్యం. చేపల సాగు ద్వారా గ్రామస్థాయి ఉపాధిని పెంచి, మత్స్యకార కుటుంబాలకు స్థిరమైన ఆదాయం కల్పిస్తాం" అని పేర్కొన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. చేప పిల్లల పంపిణీతో పాటు, ఆధునిక పద్ధతుల ద్వారా చేపల పెంపు, నిల్వ, మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరచే చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. గ్రామీణ యువతను మత్స్య పరిశ్రమలోకి ఆకర్షించేలా శిక్షణా కార్యక్రమాలు కూడా చేపడతామని మంత్రి తెలిపారు.

## సమ్మక్క సారలమ్మ మేడారం అభివృద్ధి పనుల ప్రగతి: మంత్రులు సందర్శన

- 90 రోజుల మిషన్ జాతరకు ముందు ప్రధాన కార్యాలు పూర్తి చేయాలనే లక్ష్యం...
- మంత్రి సీతక్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, అట్లూరి లక్ష్మణ్..

ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయంలో అభివృద్ధి



పనుల పురోగతిని మంత్రి సీతక్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, అట్లూరి లక్ష్మణ్ తదితరులు పరిశీలించారు. సంఘటిత ప్రదేశాల కలయికలో నిర్వహించిన అన్ని పనుల స్థితి, నిర్మాణ నాణ్యతను పరిశీలించగా ఉన్నతాధికారులతో కలిసి మినిస్టర్లు వివరాలు తెలుసుకున్నారు. ఆలయ పరిధిలో, దర్శనసౌకర్యాలు, ఏర్పాటు పనులు, భవన చిత్రాలు ఇవన్నీ సమగ్రంగా పరిశీలనకు వచ్చాయి. మధ్యాహ్నం మీడియాతో మాట్లాడిన మంత్రి సీతక్క చెప్పారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద రాజు, గోవిందరాజుల పట్ల నాయకత్వంలో బంధం, బాధ్యతా భావం ఉన్నదంటూ వారు చిత్తశుద్ధితో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. వారు పనులకు నిర్దిష్టంగా 90 రోజుల మిషన్ లక్ష్యాన్ని పెట్టుకుని పటిష్టంగా పని జరుగుతోందని, మహా మేడారం జాతరకు ముందుగా ప్రధాన పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అధికారులకు నిరంతరం సూచనలు, సమన్వయం ద్వారా వేగవంతంగా పనులు జరిగేలా చూస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. సమ్మక్క సారలమ్మల విశ్వాసం, ఆదివాసుల ఆస్తిత్వం, భక్తుల ఆత్మగౌరవాన్ని ప్రతిభటించే పద్ధతిలో పనులు జరిగేలా చూడాలని కూడా మంత్రులు సూచించారు.

## భారత బోట్స్వానా బంధం బలోపేతం

- **రెండు దేశాల మధ్య కీలక రంగాలపై సహకార విస్తరణ...**
- **చీతాల ప్రాజెక్టులో భాగంగా బోట్స్వానాకు భారత కృతజ్ఞత...**
- **చవక ధరల భారత ఔషధాలకు బోట్స్వానా ప్రజలకు సులభ ప్రాప్తి...**

**గాబోరోనే,** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును బోట్స్వానా రాష్ట్రపతి డుమా గిడియన్ బోకో



గార్మీగా ఆహ్వానించారు. గాబోరోనేలోని రాష్ట్రపతి కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఇరుదేశాల మధ్య విస్తృత చర్చలు జరిగాయి. వాణిజ్యం, పెట్టుబడులు, వ్యవసాయం, పునరుత్పాదక శక్తి, ఆరోగ్యం, విద్య, నైపుణ్యాభివృద్ధి, రక్షణ, డిజిటల్ టెక్నాలజీ రంగాలలో సహకారం విస్తరించేందుకు ఇరువురు నేతలు అంగీకరించారు. భారత రాష్ట్రపతి ముర్ము, ప్రాజెక్ట్ చీతా రెండవ దశలో భాగంగా భారతదేశానికి చీతాలను పంపినందుకు బోట్స్వానా ప్రజలకు మరియు అధ్యక్షుడు బోకోకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చర్య భారత వన్యప్రాణి సంరక్షణ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆమె పేర్కొన్నారు. అదే సందర్భంలో బోట్స్వానా పౌరులకు నాణ్యమైన మరియు చవకైన భారత ఔషధాలను సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ఆరోగ్య రంగంలో ఇరుదేశాల మధ్య కొత్త అవకాశాలను తెరుస్తుందని ఇరుపక్షాలు భావించాయి. ఇరుదేశాల మధ్య పెరుగుతున్న స్నేహబంధం ఆఫ్రికా ఖండం మరియు దక్షిణాసియా మధ్య సంబంధాలకు నూతన దిశ చూపుతుందని విశ్లేషకులు పేర్కొన్నారు. ఈ సమావేశం భవిష్యత్ సహకారానికి బలమైన పునాది వేసిందని విదేశాంగ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

## గిరిజన వ్యాపార రంగ అభివృద్ధే లక్ష్యం




**న్యూఢిల్లీ,** దేశ గిరిజన సమాజాల ఆర్థిక శక్తివంతతకు దారితీసే ట్రైబల్ బిజినెస్ కాన్క్లేవ్ 2025 నేడు ఢిల్లీలోని యశోభూమి వేదికగా ఘనంగా ప్రారంభమైంది. భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, గిరిజన వ్యవహారాల మంత్రి జువాల్ ఓరం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, "ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గిరిజన సమాజాల ఆర్థిక, సామాజిక అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోంది" అని అన్నారు. వాణిజ్య సంస్కృతి కలయిక వేదిక గిరిజన గౌరవ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కాన్క్లేవ్ ద్వారా వ్యాపార రంగ అభివృద్ధితో పాటు గిరిజన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఊతమిస్తుందని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్ సపోర్ట్, ట్రైనింగ్ సెంటర్ల ఏర్పాటుపై దృష్టి సారించిందని తెలిపారు. భారత్ అభివృద్ధి పథంలో గిరిజన సమాజం కూడా సమాన భాగస్వామ్యం వహించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గోయల్ అన్నారు. "గిరిజన సమాజం ఆధునిక వ్యాపార ప్రపంచంలో నిలదొక్కుకోవడం దేశ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుంది. అదే నిజమైన 'వోకల్ ఫర్ లోకల్' ఆత్మ" అని పేర్కొన్నారు.

## భారత్ సౌదీ పెట్టుబడి ఒప్పందంపై కీలక చర్చలు



**న్యూఢిల్లీ,** భారతదేశం మరియు సౌదీ అరేబియా మధ్య పెట్టుబడి సంబంధాలను బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తూ, కేంద్ర ఆర్థిక మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రి నిర్మలా సీతారామన్, సౌదీ పెట్టుబడి మంత్రి ఖాలిద్ అల్ ఫలీహ్‌తో బుధవారం న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ భేటీ సందర్భంగా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం పై చర్చలు జరిగాయి. రెండు దేశాల మధ్య పెట్టుబడి ఒప్పందం త్వరితగతిన తుది దశకు చేరాలని, దానివల్ల రెండు దేశాల మధ్య నేరుగా పెట్టుబడుల ప్రవాహం పెరగడంతో పాటు వ్యాపార సహకారం మరింత బలపడుతుందని ఇరువురు మంత్రులు అభిప్రాయపడ్డారు. భారత్ సౌదీ సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి చేరాయని, ఒప్పందం ఆ బంధాన్ని మరింత పటిష్ఠం చేస్తుందని పేర్కొన్నారు. భారత్ సౌదీ మధ్య వార్షిక వాణిజ్య పరిమాణం 50 బిలియన్ డాలర్లకు చేరింది. ఈ ఒప్పందం అమలులోకి వస్తే పెట్టుబడి ప్రవాహం మాత్రమే కాకుండా, సాంకేతిక, పరిశోధన, పర్యావరణ రంగాల్లో కూడా సహకారం పెరుగుతుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. రెండు దేశాల మధ్య పెరుగుతున్న ఆర్థిక బంధం భవిష్యత్‌లో గ్లోబల్ ఎకానమీకి కీలక మద్దతు ఇస్తుందని అంచనా.

## ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెన



**జమ్మూ కాశ్మీర్,** భారతదేశం తన ఇంజినీరింగ్ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిన చెనాబ్ బ్రిడ్జ్ ఇప్పుడు ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెనగా నిలిచింది. జమ్మూ కాశ్మీర్‌లోని రియాసి జిల్లాలో చెనాబ్ నది పై నిర్మించిన ఈ వంతెన, భారత రైల్వే చరిత్రలో ఒక అద్భుతమైన మైలురాయిగా నిలిచింది. ఈ ప్రాజెక్ట్ ప్రణాళిక డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రి కాలంలో రూపుదిద్దుకుంది. ప్రాజెక్ట్ ప్రణాళిక-దూరదృష్టి ఫలితం 2004లో యుపిఎ ప్రభుత్వ కాలంలో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ ప్రణాళికలో ఇంజినీరింగ్ సాంకేతికత, భద్రతా ప్రమాణాలు, పర్యావరణ అనుకూలత వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ నాయకత్వంలో కాశ్మీర్ ప్రాంతాన్ని జాతీయ రైల్వే నెట్‌వర్క్‌తో కలపాలన్న దీర్ఘకాల దృష్టితో ప్రణాళిక రూపొందించారు. 359 మీటర్ల ఎత్తులో నిర్మించబడిన చెనాబ్ బ్రిడ్జ్ ప్రపంచంలోని అత్యంత ఎత్తైన రైల్వే వంతెనగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. ఇది ప్యారిస్‌లోని ఐఫిల్ టవర్ కంటే 35 మీటర్లు ఎత్తుగా ఉంది. 1.3 కిలోమీటర్ల పొడవు గల ఈ వంతెనను 28,000 టన్నుల స్టీల్‌తో నిర్మించారు. పర్వత ప్రాంతాల క్లిష్ట వాతావరణ పరిస్థితుల్లోనూ ఈ నిర్మాణం సాధ్యమవడం భారత ఇంజినీర్ల ప్రతిభకు నిదర్శనం. దేశ ఐక్యతకు సంకేతంచెనాబ్ బ్రిడ్జ్ కేవలం ఒక రైల్వే వంతెన మాత్రమే కాదు, కాశ్మీర్ ప్రజల ఆర్థిక సామాజిక అభివృద్ధికి, దేశ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఈ వంతెనతో కాశ్మీర్ లోయలో వాణిజ్య, పర్యాటక రంగాలకు కొత్త ఊపు రానుందని అధికారులు పేర్కొన్నారు. దేశ నిర్మాణ చరిత్రలో ఇది డాక్టర్ మన్మోహన్ సింగ్ దూరదృష్టికి ప్రతీకగా నిలిచే ప్రాజెక్ట్‌గా అభివర్ణించబడుతోంది.

## హనుమాన్ ఆలయం వద్ద ఇనుప విద్యుత్ స్థంభం ప్రమాదకరం

**-వెంటనే మార్చాలంటూ ప్రజల విజ్ఞప్తి...**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 12 మన వార్త :** అల్వాల్ సర్కిల్ పరిధిలోని 133 డివిజన్ లోని కౌకూర్ ప్రాంత ప్రజలు విద్యుత్ సదుపాయాల దుస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. హనుమాన్ ఆలయం సమీపంలో ఉన్న ఇనుప విద్యుత్ స్థంభం తుప్పు పట్టి ప్రమాదకరంగా మారిందని,వెంటనే దానిని సిమెంట్ స్థంభంతో మార్చాలని స్థానిక నాయకుడు మల్లేశ్ యాదవ్ విద్యుత్ శాఖ అధికారులకు లేఖ ద్వారా కోరారు. యాప్రాల్ సబ్ స్టేషన్ అసిస్టెంట్ ఇంజనీర్‌కు పంపిన లేఖలో మల్లేశ్ యాదవ్ ఇలా పేర్కొన్నారు. హనుమాన్ టెంపుల్ కింది బస్తీ కౌకూర్, రెడ్డి బస్తీ కౌకూర్,కుమ్మరి బస్తీ కౌకూర్, బర్షపేట్ కౌకూర్ ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ బలహీనంగా ఉంది. పాత ఇనుప స్థంభాలు తుప్పు పట్టి వర్షాకాలంలో ప్రమాదాలకు దారితీస్తున్నాయి. ప్రజల భద్రత కోసం వాటిని సిమెంట్ స్థంభాలతో మార్చాలి అని తెలిపారు. అలాగే హనుమాన్ ఆలయం వద్ద ఉన్న స్థంభాల ఎత్తు తక్కువగా ఉండడంతో, పెద్ద వాహనాలు తగిలే ప్రమాదం ఉందని చెప్పారు. స్థంభాల ఎత్తు పెంచితే ప్రజా భద్రత మెరుగుపడుతుందని ఆయన సూచించారు. ఇక మూడవ అంశంగా, ప్రస్తుతం ఉన్న సింగిల్ ఫేజ్ విద్యుత్ సరఫరా సరిపడడం లేదని, త్రిఫేజ్ లైన్ ఇవ్వాలని మల్లేశ్ యాదవ్ అభ్యర్థించారు. విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతుండటంతో, ఆధునిక అవసరాలకు తగిన విధంగా సరఫరా వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. యాప్రాల్ విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ సమస్యలపై అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.లక్ష్మణ్ యాదవ్, మల్లేశ్ యాదవ్, వెంకటేశ్ యాదవ్, తిరుపతి రావు, నమదాస్ మరియు బుజ్జి పాల్గొన్నారు.



## కార్పొరేటర్,అధికారులు మౌనం

**-మచ్చ బొల్లారం రోడ్లు దారుణం...**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 12 మన వార్త :** ఆల్వాల్ సర్కిల్ పరిధిలోని 133 డివిజన్ మచ్చబొల్లారం ప్రాంతంలో రోడ్ల పరిస్థితి ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇందిరా గాంధీ విగ్రహం నుండి అంబేద్కర్ నగర్ వరకు సాగుతున్న ప్రధాన మార్గం ప్రతి మీటర్‌లో ఒక గుంతగా, ప్రతి మలుపులో ఒక ప్రమాదంగా మారిపోయింది. భవాని నగర్, వివిఆర్, సిటిజన్ కాలనీ, అల్వాల్ హిల్స్, బతుకమ్మ పార్క్, సూర్య నగర్, ఐస్ ఫ్యాక్టరీ రోడ్, సెలెక్ట్ టాకీస్, సెవెన్ టెంపుల్స్ వాటర్ ట్యాంక్, ఎంజీ నగర్ దాకా ఎక్కడ చూసినా రహదారులపై పెద్ద పెద్ద గుంతలే. పైపులైన్ పనుల పేరుతో చేసిన ప్యాచ్ వర్క్ నాణ్యతలేని పదార్థంతో కేవలం చూపు కోసం చేసినట్టుగా కనిపిస్తోంది. రోడ్డు మీద పడేసిన రాళ్లు వర్షం తర్వాత చెరువుల్లా మారి నీరు నిల్వపోవడంతో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ప్రతిరోజూ యుద్ధ భూమిలో ప్రయాణిస్తున్నట్టే ఉంది. బైక్ టైర్లు జారిపోవడం, కార్ల బంపర్లు నేలకు రుద్దుకోవడం, ప్రతి గుంత ఒక ప్రమాదాన్ని కాచుకోవడం రోజువారీ దృశ్యాలుగా మారిపోయాయి. స్కూల్‌కి వెళ్లే పిల్లలు, బజారుకి వెళ్లే వృద్ధులు, ఉద్యోగాలకు వెళ్లే యువత అందరికీ ఈ రోడ్లు శిక్షలా మారాయి. వాహనాలు దెబ్బ తినడం,చిన్నపాటి ప్రమాదాలు పెరగడం ఇప్పుడు నిత్యకృత్యాల్లా మారిపోయాయి. ఈ కాలనీల రోడ్లు ఎవరి దృష్టికీ రావడం లేదు క్రితం వదిలేసిన పాత నోటుబుక్ పేజీల్లా మరచిపోయాయి. జిహెచ్ఎంసి సంబంధిత శాఖల ఇంజినీర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సర్కిల్ కార్యాలయం ఈ దుస్థితి చూశాక కూడా చర్యలు తీసుకోకపోవడం ప్రజలను మరింత ఆగ్రహానికి గురిచేస్తోంది. రోడ్లు తవ్వకాలు చేసి వదిలేయడం, పునర్నిర్మాణ పనులు నెలల తరబడి నిలిచిపోవడం, రాత్రివేళ లోడ్ వాహనాల రాకపోకలతో రహదారులు మరింతగా పాడైపోవడం ప్రజా సమస్యను మరింత విషమం చేస్తున్నాయి. స్థానిక కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ పరిధిలో రోడ్ల పరిస్థితి ఈ స్థాయికి దిగజారడం ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తిని రేకెత్తిస్తోంది. ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసినా పరిష్కారం కానందున, ప్రజలు ఇచ్చిన హామీలకు ఏమైందో అంటూ ప్రశ్నిస్తున్నారు.



## కౌకూర్ ఆర్జీకె కాలనీలో వీధి దీపాలులేక రెండు నెలల నుండి చీకట్లో కాలనీ

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నవంబర్ 12 మన వార్త :** అల్వాల్ జిహెచ్ఎంసి పరిధిలోని 133 డివిజన్ మచ్చ బొల్లారం కౌకూర్ ఆర్జీకె కాలనీలో గత రెండు నెలలుగా వీధి దీపాలు పనిచేయకపోవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రత్యేకంగా రేణుక ఎల్లమ్మ గుడి ముందు ఉన్న బ్లాక్ నంబర్ 19 ప్రాంతం పూర్తిగా చీకటిలో మునిగిపోవడంతో రాత్రి వేళలు స్థానికులు బయటకి రావడానికి కూడా భయపడుతున్నారు. కాలనీవాసుల ప్రకారం, సమస్యను అనేకసార్లు జిహెచ్ఎంసి అధికారులకు తెలియజేసినా ఎటువంటి చర్యలు కనిపించలేదని వాపోతున్నారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులు చీకటి కారణంగా రాత్రి ఇంటి ముందుకే రావడానికి సంకోచించే పరిస్థితి నెలకొంది. చీకటి ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం పెరుగుతోందనే భయం స్థానికుల్లో ఉంది. చిన్న పిల్లలు సాయంత్రం బయట ఆడుకోవడానికి కూడా ధైర్యం చేయలేకపోతున్నారని కాలనీవాసులు పేర్కొన్నారు. ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని ప్రజలు జిహెచ్ఎంసి అధికారులను కోరుతున్నారు. వీధి దీపాల పునరుద్ధరణతో కాలనీ ప్రజల భద్రత, శాంతి, నిత్యజీవితం పునరుద్ధరించాలని వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాలనీవాసుల విజ్ఞప్తి రెండు నెలలుగా మా కాలనీ చీకటిలో కూరుకుపోయింది. కనీసం ఇప్పుడు అయినా దీపాలు వెలిగించే చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.



## నిరుపేద కుటుంబానికి పుస్తెలు అందజేత...

**-చిట్నేని మాధవి వెంకటేశ్వరరావు...**

**రాజన్న సిరిసిల్ల నవంబర్ 13(మన వార్త)**రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గంగాధరి కనకవ్వ రాజనర్సయ్య, కనిష్ట పుత్రిక కళ్యాణి వివాహం నవంబర్ 16వ తారీఖున ఉన్నందున వారి కుటుంబ పరిస్థితులను చూసి ఓబీసీ మోర్చా ముస్తాబాద్ మండల అధ్యక్షులు చిగురు వెంకన్న గూడెం గ్రామానికి చెందిన చిట్నేని మాధవి వెంకటేశ్వర్లు సంప్రదించి వారి కుటుంబ పరిస్థితులను వివరించి పుస్తెలు ఇవ్వగలరని తెలుపగా వెంటనే స్పందించి ఈ సందర్భంగా వారు వెంటనే పుస్తెలు ఇవ్వడానికి ముందుకు రావడం జరిగింది. అని తెలిపారు, ఓబీసీ మోర్చా ముస్తాబాద్ మండల అధ్యక్షులు చిగురు వెంకన్న పుస్తెలు అందజేశారు, ఈ కార్యక్రమానికి సహకరించిన విద్యాసాగర్ రావు భారతి, చిట్నేని శ్రీనివాసరావు గారికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు, ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా ముస్తాబాద్ మండల అధ్యక్షులు చిగురు వెంకన్న బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకట్ స్వామి బీసీ యువజన సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి ఈడుగురాల సురేష్ గౌడ్ భగత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు..



## కొత్త చెరువు ఆవరణ శుభ్రంగా ఉండాలి







**-డంప్ యార్డులో తడి, పొడి చెత్త వేరు చేయాలి...**
**-అవసరమైన యంత్రాలు, పరికరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి...**
**-అన్ని అమ్మకాలు రైతు బజార్లో జరగాలి...**
**-ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్...**

**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 12(మన వార్త)**సిరిసిల్ల పట్టణంలోని కొత్త చెరువు ఆవరణ శుభ్రంగా ఉండాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని కొత్త చెరువును ఇంచార్జి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. చెరువు కట్ట పైకి వెళ్లి, పరిసరాలు సందర్శించి, అధికారులకు పలు సూచనలు చేశారు. చెరువు పరిసరాలు మొత్తం శుభ్రం చేయాలని, చెత్తాచెదారం, చెట్లు తొలగించాలని సూచించారు. ఇక్కడ అవసరమైన యంత్రాలు, సామగ్రిపై ప్రతిపాదనలు పంపాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. పట్టణ ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా తీర్చిదిద్దాలని సూచించారు. నిర్వహణ సక్రమంగా చేపట్టాలి సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద ఉన్న డంపింగ్ యార్డ్ ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించారు. తడి, పొడి చెత్త వేరు చేసే విధానం, ఆవరణ పరిసరాలు పరిశీలించారు. నిర్వహణ సక్రమంగా చేపట్టాలని అన్నారు. కంపోస్ట్ షెడ్ ను పరిశీలించి కంపోస్ట్ తయారీ వివరాలను ఆరా తీశారు. డంపింగ్ యార్డుకు కావాల్సిన యంత్రాలు, పరికరాలకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. రైతు బజార్ లోనే విక్రయాలు చేయాలి సిరిసిల్ల పట్టణంలోని రైతు బజార్ లో చికెన్, మటన్, చేపలు, కూరగాయల విక్రయాలు పూర్తి స్థాయిలో ఇక్కడే చేసేలా ఏర్పాట్లు చేయాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కూరగాయల షెడ్ ను పరిశీలించారు. స్లాటర్ హౌస్ నిర్మించి, చికెన్, మటన్, చేపలు విక్రయాల పూర్తి స్థాయిలో చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరిశీలనలో సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీవీహెచ్ఓ రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలు ముగింపు...

**-గాలిపల్లిలో ఉత్సాహంగా ముగిసిన బాల,బాలికల పోటీలు...**

**ఇల్లంతకుంట,నవంబర్ 12 (మన వార్త ప్రతినిధి):**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని గాలిపల్లి గ్రామంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్,ఈతరం యువజన సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి బాల,బాలికల జూనియర్ కబడ్డీ పోటీలు మంగళవారం విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి పాఠశాల హెచ్.ఎం మేకల పావని అధ్యక్షత వహించగా,ముఖ్య అతిథిగా ఇల్లంతకుంట ఎస్.ఐ సిరిసిల్ల అశోక్ పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. బాలికల విభాగంలో కేజీబీవీ ఇల్లంతకుంట జట్టు ప్రథమ,తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్ రహీంఖాన్‌పేట ద్వితీయ బహుమతులు గెలుచుకున్నాయి. బాలుర విభాగంలో చెక్కపల్లి జట్టు ప్రథమ,రహీంఖాన్‌పేట మోడల్ స్కూల్ ద్వితీయ బహుమతులు సాధించాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ సింగరపు తిరుపతి,ఉపాధ్యక్షులు బొడ్డు రాములు,బొడ్డు నారాయణ,యువజన సంఘం అధ్యక్షుడు జి.నరేష్,సెక్రటరీ ఇ.సాయి గణేష్ తదితరులు పాల్గొన్నారు.




## మృతుల కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

**-బాధిత కుటుంబాలకు మనోధైర్యాన్ని అందించారు...**
**-కాంగ్రెస్ పార్టీ వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటాము...**

**వెంకటాపూర్ రామప్ప నవంబర్12 మన వార్తా ప్రతినిధి** తెలంగాణా రాష్ట్ర పంచాయితీరాజ్,గ్రామీణాభివృద్ధి,స్త్రీ-శిశుసంక్షేమశాఖ మంత్రి.Dr,,దనసరి.అనసూయ(సీతక్క) ఆదేశాలమేరకు,జిల్లా అధ్యక్షులు-పైడాకుల.అశోక్ సూచనలమేరకు,,ఇటీవలకాలంలో వెంకటాపూర్(రామప్ప)మండలంలోని కేశవాపూర్ గ్రామ వాస్తవ్యులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు-MD.కబీర్ గారి కోడలు గుండెపోటుతో హఠాత్మరణం చెందగా,వారి దశదినకర్మకు హాజరై,వారి కుటుంబాన్ని పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా,,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు-బైరెడ్డి.భగవాన్ రెడ్డి,మండల వర్కింగ్ ప్రెసిడెంట్-బండి.శ్రీనివాస్,జిల్లా ప్రధాన కార్యదర్శి-వేముల.చంద్రాకర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దొంతరవేని.కుమార్,జిల్లా BC సెల్ ప్రధాన కార్యదర్శి-పచ్చిమట్ల.రాంబాబు,గ్రామ కమిటీ అధ్యక్షులు-తోట.భద్రయ్య, మరియు జిల్లా సీనియర్ నాయకులు,యువజన నాయకులు,ప్రజా ప్రతినిధులు మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.



## శ్రీ త్రిమూర్తి స్వరూపిణి శ్రీశ్రీ ముత్యాలమ్మన్ ఆలయంలో స్వాములకు బిక్ష కార్యక్రమం...

**-ఉమాశంకర్ రెడ్డి గురుస్వామి...**

**చేవెళ్ల :నవంబర్ 12 (మన వార్త ప్రతినిధి)**గత 27 రోజులుగా స్వామివారి నామస్మరణ చేసుకుంటూ శ్రీ స్వామి వారి పైన అచంచలమైన భక్తి విశ్వాసాలతో శ్రీ స్వామివారి నామస్మరణ చేసుకుంటూ లోక సమస్త సుఖినోభవంతు అనే సంకల్పంతో ముందుకు సాగుతున్న మన గురుస్వామి మహా పాదయాత్ర బృందం ఈరోజు తమిళనాడు రాష్ట్రం దిండిగల్ జిల్లా తాడి కంభం శ్రీశ్రీ ముత్యాలమ్మన్ ఆలయంలో మధ్యాహ్నం బిక్ష కార్యక్రమం కోసం ఆగడం జరిగింది. ఈరోజు స్వాములకు అన్నప్రసాద సేవను కంది మండలం చర్లగూడెం గ్రామానికి చెందిన దొడ్ల రాజనర్సింహారెడ్డి, దొడ్ల అనురాధ దంపతులు వారి కుమారుడు దొడ్ల నిశాంత్ రెడ్డి స్వామి వారి ధర్మపత్ని సంధ్య, కుమారుడు జశ్విక్ రెడ్డి, కుమార్తె స్నితిక రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ శంకర్ రెడ్డి గురుస్వామి మాట్లాడుతూ ఈరోజు అన్న ప్రసాద సేవ చేసిన వారు మా శ్రీమతికి అమ్మానాన్నలు అన్నా వదినలు అని ఉమా శంకర్ రెడ్డి గురుస్వామి తెలియజేశారు. మహా పాదయాత్రగా వస్తున్న మనకు ప్రతి సంవత్సరము అన్నప్రసాద సేవ చేస్తున్నారని మన గురుస్వామి మహా పాదయాత్ర రెండవ సంవత్సరం నిత్య అన్నదాన ప్రభువులు గా ఉన్నారని ఎలా ప్రతి సంవత్సరం స్వాముల సేవలో పాల్గొంటున్న నీశాంత్ రెడ్డి స్వామి ఇప్పుడు శ్రీశ్రీ అయ్యప్ప స్వామి వారి మాల ధరించి దీక్షలో ఉన్నాడని స్వామివారి దీక్షలో ఉండి స్వాముల అన్నప్రసాద సేవలో పాల్గొనడం ఎంతో ఆనందదాయకమని మరి గత నాలుగు సంవత్సరాలుగా మహా పాదయాత్రగా వస్తున్న మన బృందానికి తనకు తోచిన విధంగా సహాయ సహకారాలు అందిస్తున్న రాజనర్సింహారెడ్డి దంపతులపైన, నిశాంత్ రెడ్డి దంపతుల పైన వారి కుమారుడు కుమార్తె పైన అన్నదాన ప్రభువైన శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి వారి సేవలో నిరంతరం పాల్గొంటూ స్వాముల సేవలో కూడా పాలుపంచుకునే భాగ్యాన్ని శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి వారికి ప్రసాదించాలని ఈ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నీశాంత్ రెడ్డి కుటుంబ సభ్యులందరి పైన శ్రీ శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని వారికి ఆయురారోగ్యాలను అష్టైశ్వర్యాలను ప్రసాదించాలని మన గురుస్వామి మహాపాదయాత్ర బృందం తరపున అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీ శ్రీ అయ్యప్ప స్వామి వారిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు ఉమా శంకర్ రెడ్డి గురుస్వామి అన్నారు. ఈ బిక్షా కార్యక్రమంలో గురు స్వాములు నస్కల్ గోపాల్ రెడ్డి స్వామి, ఎన్కేపల్లి ముత్యంరెడ్డి స్వామి, వేమారెడ్డి స్వామి, మనసాన్పల్లి సిద్దు స్వామి, హైతబాద్ మల్లేష్ స్వామి, శంకర్ పల్లి రఘురాం రెడ్డి స్వామి, మణి కాంత్ రెడ్డి స్వామి, శ్రీరాంనగర్ రఘురాం రెడ్డి స్వామి, రామంతపూర్ శ్రీకాంత్ రెడ్డి స్వామి, ప్రొద్దుటూరు లక్ష్మారెడ్డి స్వామి, మాసానిగూడెం లక్ష్మణ్ రెడ్డి స్వామి, కందవాడ రామ్ రెడ్డి స్వామి, వివిధ గ్రామాల గురు స్వాములు, స్వాములు, తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అభివృద్ధిలో వైఫల్యం చెందింది

**–ఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి...**

**రాజన్న సిరిసిల్ల నవంబర్ 13(మన వార్త)**రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు శీలం స్వామి ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శీలం స్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి 6 గ్యారెంటీల పేరిట 420 హామీల పేరిట ప్రజలకు హామీలను ఇచ్చి, ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు. రాష్ట్రంలోని ఏ గ్రామంలో చూసినా కాంగ్రెస్ ప్రభుత్వ చేసిన అభివృద్ధి ఏమిలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామ గ్రామన కట్టిన ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలకు కలర్లు కూడా వెపించే చేత కాని అసమర్థత కాంగ్రెస్ ప్రభుత్వందని, అని అన్నారు, అలాగే సంక్షేమంను ప్రజలకు అందించడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని అన్నారు, రైతులకు 500 వరి బోనస్ మోసం, వృద్ధులకు చేయూత పేరుతో 4 వేలు పెన్షన్ మోసం, యువవికాసం పేరుతో యువతతో లక్షల అప్లికేషన్ లు చేపించుకొని ఆ పథకాన్ని అటుకెక్కించిన తీరు, విద్యా రంగం పేరుతో కాలేజీ వెళ్ళే అమ్మాయికు స్కూటీలు ఇస్తానని మోసం, మండలానికి ఒక ఇంటర్నేషనల్ స్కూలు పేరుట ఘరానామోసం, ప్రతి విద్యార్థికి ఐదు లక్షల విద్యా భరోసా కార్డు పేరిట విద్యార్థుల మోసం చేశారని, ఇవే కాకుండా 420 హామీలు తెలంగాణ ప్రజలు తీరును ప్రజలు గ్రహించి,రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని గ్రామాలలో చిత్తుచిత్తు ఓడించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పారిపెల్లి శ్రీనివాస్, పడిగే ఆంజనేయులు, కోడె శ్రీనివాస్,సోషల్ మీడియా వారియర్ పరిధిపేట వెంకటేష్, కేటీఆర్ సేన ముస్తాబాద్ మండల అధ్యక్షులు వంగూరి దిలీప్, భూక్య మధు నాయక్, తదితరులు పాల్గొన్నారు.



## దొడ్డు వడ్లను సైతం రైస్ మిల్లర్లు దిగుమతి చేసుకోవాలి...

**–రైస్ మిల్లర్లను హెచ్చరించిన తహసిల్దార్ శివప్రసాద్...**

**చేగుంట నవంబర్ 12( మన వార్త (ప్రతినిధి)**చేగుంట మండలంలోని మక్క రాజుపేట ప్రాంతంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు మరియు రైస్ మిల్లులను అధికారులు పరిశీలించారు. రైతులు సన్న వడ్లు, దొడ్డు వడ్లు కొనుగోలు కేంద్రాల వద్ద విగ్రహించుకున్న రైస్ మిల్లుల వద్ద మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం రావడంతో తహశీల్దార్ (ఎంఆర్ఓ) శివప్రసాద్ బృందంతో కలిసి బాలాజీ రైస్ మిల్ వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డిఓ జయచంద్ర రెడ్డి ఆదేశాల మేరకు రైస్ మిల్ లను తనిఖీ చేసినట్లు ఆయన తెలిపారు "రైతులు తెచ్చిన సన్న వడ్లు, దొడ్డు వడ్లు ఎలాంటి వర్గీకరణ లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తప్పనిసరిగా కొనుగోలు చేయాలని. రైతుల ధాన్యాన్ని తిరస్కరించడం లేదా ఆలస్యం చేయడం సహించబోదని దిగుమతి చేసుకొని మిల్లర్లపై చర్యలు తప్పవు" అని ఆయన హెచ్చరించారు. మక్కరాజుపేటలో దొడ్డు వడ్ల లారీలు నిలిపివేసి ధాన్యం దిగమతిని నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలిసిన నేపథ్యంలో ఆయన మిల్లర్‌ను ప్రశ్నించారు. రైతుల ప్రయోజనాలు దెబ్బతినకుండా వెంటనే కొనుగోలు చేసిన దాన్యం వెంటనే దిగుమతి చేసుకోవాలని ఆయన రైస్ మిల్లర్లను ఆదేశించారు తనిఖీల్లో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. రైతుల ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని తహసిల్దార్ సూచించారు.




## బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలి

**–సిడిపిఓ స్వరూప...**

**చేగుంట నవంబర్ 12( మన వార్త (ప్రతినిధి)** బాల్య వివాహాలు సమాజ అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నాయని బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని సీడీపీఓ స్వరూప పేర్కొన్నారు. చేగుంట ఎంపీడీవో కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు . ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ చిన్న వయస్సులో పెళ్లి చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు చదువు కు దూరమవడం,కుటుంబం లో సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ప్రతి గ్రామంలో ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాలు, ఆంగన్‌వాడీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎమ్మార్వో శివ ప్రసాద్,ఎంపీడీవో చిన్నారెడ్డి, ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి, ఎంపీ ఓ ప్రశాంత్, ఎంఈఓ నీరజ, సూపర్వైజర్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూ బాల్య వివాహాలు జరిపే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్నారుల భవిష్యత్తు బాగుండాలంటే వారికి విద్యా హక్కు, ఆరోగ్య భద్రత, ఆర్థిక స్వావలంబన కల్పించాలి అని అధికారులు సూచించారు. గ్రామ స్థాయిలో మహిళా సంఘాలు, ఆంగన్‌వాడీ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు మరింత బలోపేతం చేయాలని అన్నారు.




## తెలంగాణ రాష్ట్రంలో ద్వితీయ స్థానం సాధించిన రేపాక విద్యార్థిని బొడ్డు వర్షిణి...

**–మూడు రాష్ట్రాల టాలెంట్ టెస్ట్‌లో తృతీయ ర్యాంక్....**

**ఇల్లంతకుంట,నవంబర్ 12 (ప్రత్యేక ప్రతినిధి):**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని రేపాక గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని బొడ్డు వర్షిణి ప్రతిభతో మెరిసింది. సదిష ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్ట్ 2025లో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం,అలాగే ఆంధ్రప్రదేశ్,మహారాష్ట్ర,తెలంగాణ మూడు రాష్ట్రాల స్థాయిలో తృతీయ ర్యాంక్ సాధించి పాఠశాలకు గౌరవం తెచ్చింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేవతి మేడం మాట్లాడుతూ మన పాఠశాల విద్యార్థిని వర్షిణి ఈ స్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణం. కార్పొరేట్ కాలేజీలు వర్షిణి వంటి ప్రతిభావంతులైన విద్యార్థులకు ఇంటర్‌మీడియట్ విద్యను ఉచితంగా అందించడం తో పాటు హాస్టల్ వసతి,ప్రయాణ సౌకర్యాలను కూడా కల్పిస్తున్నాయి. వీరితోపాటు ఇతర పాఠశాలకు చెందిన 80 మంది విద్యార్థులకు కూడా ఇంటర్‌మీడియట్ చదువును ఉచితంగా అందిస్తున్నారు. వర్షిణి ను ఆదర్శంగా తీసుకుని ఇతర విద్యార్థులు కూడా బాగా చదువుకోవాలని సూచిస్తున్నాను.. అని అన్నారు. బొడ్డు వర్షిణి మాట్లాడుతూ ఈ ర్యాంక్ సాధించడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. నా తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రోత్సాహం వల్లే ఈ విజయం సాధ్యమైంది. ఈ అవకాశాన్ని మరింత శ్రద్ధగా ఉపయోగించి,భవిష్యత్తులో కూడా మంచి ప్రతిభ చూపించాలనే నిర్ణయం తీసుకున్నాను అని చెప్పింది.



## పారదర్శకమైన పాలన కోసమే సమాచార హక్కు చట్టం...

**–రాష్ట్ర సమాచార కమిషనర్ పోరెడ్డి అయోధ్య రెడ్డి...**

**యాదాద్రి భువనగిరి జిల్లా నవంబర్ / 12 / మన వార్త జిల్లా ప్రతినిధి** సమాచార హక్కు చట్టం ఆర్టిఐ-2005 ను పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులు , సహాయ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ అధికారులు కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర సమాచార కమిషనర్ పోరెడ్డి అయోధ్య రెడ్డి అన్నారు. బుధ వారం రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమాచార హక్కు చట్టం పై రాష్ట్ర సమాచార కమిషనర్ల ఆధ్వర్యంలో పీఐవో , అపిలెట్ అధికారులకు చట్టం పట్ల నిర్వహించిన అవగాహన సదస్సులో సమాచార కమిషనర్లు దేశాల భూపాల్ , పి.వి శ్రీనివాస్ రావు , మోసినా పర్వీన్ , జిల్లా కలెక్టర్ హనుమంతరావు , డి.సి.పి అక్షాంక్ష్ యాదవ్ , ఏసిపి రాహుల్ రెడ్డి లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టిఐ కమిషనర్ అయోధ్య రెడ్డి మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కింద సమాచారం అడిగిన వాళ్లను దోషిగా చూడాలని లేదన్నారు. సమాచార హక్కు చట్టం ప్రకారం అడిగిన సమాచారం తప్పకుండా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరికి సమాచార హక్కు చట్టం ప్రకారం అడిగే హక్కు ఉందన్నారు. పాలనలో పారదర్శకత కోసమే 2005 లో సమాచార హక్కు చట్టాన్ని తెచ్చారని , ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో 41బి చార్ట్ ను తప్పనిసరిగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించి ఏమీ లేని విధంగా చెయ్యాలనే ఉద్దేశంతో జిల్లాలో పర్యటిస్తున్నామని 15 జిల్లాలో పర్యటించి అప్పటికప్పుడే పరిష్కారం అయ్యే విధంగా చేస్తున్నామన్నారు. 6 (1) కింద దరఖాసుదారుడు కోరిన సమాచారం అందించాలని , ప్రతి కార్యాలయంలో పిఐఓ , ఏపీఐఓ లు దరఖాస్తులు స్వీకరించి నిర్ణీత సమయంలో సమాచారం అందించాలని , అధికారులు ఆర్టిఐ చట్టం-2005 పై అందరికీ సమగ్రమైన అవగాహన కల్పించి పటిష్టంగా అమలు జరగాలని లక్ష్యంగా ఆర్టిఏ కమిషన్ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. సమాచార హక్కు చట్టం కమిషనర్ పీవీ. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం పౌరులకు పారదర్శకత , బాధ్యతాయుత పరిపాలన అందించడంలో కీలకమైన సాధనమని తెలిపారు. పీఐవో అధికారులు ప్రజలకు సమయానికి , పూర్తి సమాచారాన్ని అందించాలని సూచించారు. ఆర్టిఐ దరఖాస్తుల పరిష్కారం ఆలస్యం కాకుండా , చట్టంలో ఉన్న సమయపరిమితి లోపల సమాధానమివ్వాలని ఆదేశించారు. గత మూడు సంవత్సరాల నుండి ఆర్టిఐ కేసులో పెండింగ్ ఉన్నాయని , వీటిని త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లాల పర్యటనలు చేపట్టడం జరుగు తుందన్నారు. పారదర్శకమైన పాలన కోసం చట్టం ఉపయోగ పడాలని , ప్రజలు చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా వినియోగించుకోవాలన్నారు. అధికారులు చట్టం పట్ల భయం విడనాడి నిర్భయంగా యాక్ట్ ప్రకారం అడిగిన సమాచారాన్ని నిర్ణీత సమయంలో అంద జేయాలన , ఆర్టిఐ చట్టాన్ని సక్రమంగా అమలు చేస్తే అవినీతి తగ్గిపోతుందని , ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరుగు తుందన్నారు. అన్ని శాఖల అధికారులు 4-1 బి , సిటిజన్ చార్టర్ ను పక్కాగా అమలు చేస్తే సమస్యలు తగ్గుతాయన్నారు. ప్రభుత్వ శాఖలు పారదర్శకత , జవాబుదారీతనంతో పని చేయాలని , జిల్లాస్థాయిలో ప్రతి మూడు నెలలకు ఒకసారి అధికారులకు చట్టంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర సమాచార కమిషన్ కమిషనర్లు దేశాల భూపాల్ , అధికారులకు ఆర్టిఐ యాక్ట్ పై దరఖాస్తుల స్వీకరణ , పరిష్కారం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం రెండు వైపులా పదునైన చట్టమని అన్నారు. రాష్ట్ర సమాచార కమిషన్ పర్వీన్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాల్లో 6 చాప్టర్లు , 31 సెక్షన్లు ఉన్నాయన్నారు. సెక్షన్ల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా పి .ఐ.ఓ , ఏ.పి.ఐ.ఓ లకు క్షుణ్ణంగా వివరించారు. జిల్లా కలెక్టర్ హనుమంత రావు మాట్లడుతూ సమాచార హక్కు చట్టం నిజాయితీగా , పారదర్శకంగా , నిష్పక్షికంగా ఉండాలనే ఉద్దేశంతో ఈ కమిషన్ పని చేస్తుందన్నారు. సమాచార కోరిన వ్యక్తికి నిర్దేశిత వ్యవధిలో కాకుండా ముందుగానే సమాచారం అందించాలన్నారు. ప్రతి ఒక్క అధికారి అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లాలోని అందరూ పీఐవో అధికారులు యాక్ట్ నిబంధనల ప్రకారం సమాచార హక్కు చట్టం కింద అడిగిన సమాచారాన్ని అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అనంతరం కమిషనర్లను శాలువ , మెమొంటోలతో కలెక్టర్ సత్కరించారు. సమావేశ అనంతరం పెండింగ్ లో ఉన్న ఆర్టీఐ దరఖాస్తులపై విచారణ నిర్వహించారు. సంబంధిత పీఐవో అధికారులు , దరఖాస్తుదారుల నుండి వివరాలు స్వీకరించి తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి , స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు , ఆర్డిఓ కృష్ణా రెడ్డి , జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ , వివిధ శాఖల పిఐఓ లు , ఏ . పి.ఐ.ఓ లు , అప్పీలెట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్ రద్దు...

**–నెడోక ప్రకటనలో వెల్లడించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు...**

**యాదాద్రి భువనగిరి జిల్లా నవంబర్ / 12 / మన వార్త జిల్లా ప్రతినిధి** ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్ , ఉద్యోగవాణి కార్యక్రమం తేది 13.11.2025 రద్దు చేయడం జరిగిందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు నేడొక ప్రకటనలో తెలిపారు. తేది 13.11.2025న గురువారం రోజున నిర్వహించే గ్రీవెన్స్ , ఉద్యోగవాణి కార్యక్రమం ఉండదని , ప్రజలు , ఉద్యోగులు వారి యొక్క సమస్యల పై దరఖాస్తులను ఇచ్చేందుకు రావద్దని జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు.



## క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసిక ఉత్తేజాన్ని నింపుతాయి

**–తహశిల్దార్ రాళ్ల బండి రాంబాబు...**

**–మధిరలో ఘనంగా ప్రారంభమైన అండర్ 14, 17 బాలికల వాలీబాల్ పోటీలు...**

**మధిర,నవంబర్ 12(మనవార్త):**అండర్ 14-17 బాలికలు,బాయ్స్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం టీవీఎం స్కూల్ మైదానంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను తాహశిల్దార్ రాళ్ల బండి రాంబాబు,మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, టౌన్ సీఐ రమేష్,ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఎం ఈ ఓ వై. ప్రభాకర్ తొ కలిసి తాహశిల్దార్ ప్రారంభించారు. అంతకుముందు విద్యార్థులు స్కూల్ మైదానంలో మార్చ్ పాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశిల్దార్ రాంబాబు మాట్లాడుతూ,క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసిక ఉత్తేజాన్ని కలుగజేస్తాయని, విద్యార్థులు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలని తెలిపారు. క్రీడలతో స్నేహ భావంతో పాటు విద్యార్థులు ఒత్తిడి నుంచి రిలీఫ్ అవడానికి ఉపయోగపడుతాయన్నారు. క్రీడలతో పోటీతత్వం పెంపొందడంతో పాటు ప్రతిభను తెలియజేస్తుందన్నారు. గెలుపోటములు సహజమైనప్ప టికి ప్రతి ఒక్కరూ పోటీల్లో పాల్గొని తమ క్రీడా స్ఫూ ర్తి చాటుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంఈఓ ప్రభాకర్ మాట్లాడుతూ, రెండు రోజుల పాటు వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. మొదటి రోజు అండర్ 14 జరిగినట్లు రెండో రోజు అండర్ 17 నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థినిలు, విద్యార్థులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను కనబరుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మిరియాల వెంకటరమణ గుప్తా, క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ వై చిన్ని, ఉపాధ్యాయులు, పీటీలు తదితరులు పాల్గొన్నారు.



## పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత..

**జమ్మికుంట, నవంబర్ 12( మన వార్త (ప్రతినిధి):**గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇళ్ళందకుంట మండలంలోని 258 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గంగిశెట్టి జగదీశ్వర్ రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఇల్లందకుంట మండలంలోని ఆరు జిల్లా పరిషత్ హై స్కూల్స్, కేజీబీవీలలో చదువుతున్న 158 మంది పదవ తరగతి విద్యార్థులకు, మోడల్ స్కూల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న 100 మంది విద్యార్థులకు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇల్లందకుంట ప్రధానోపాధ్యాయులు తస్నీన్ నజీనీన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరము ప్రభుత్వ పాఠశాల లో చదివే విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు ఇవ్వడం, పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టులు నిర్వహించడం, పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన స్కూల్ టాపర్స్ కు ప్రోత్సాహక బహుమతులు అందించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించడం దాతృత్వ గుణం కలిగి ఉన్న వారే చేయగలుగుతారని అభినందించారు. మోడల్ స్కూల్ ఇన్చార్జి ప్రిన్సిపల్ పి. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మధురమ్మ ట్రస్ట్ చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాలను వెలకట్టలేమని, ట్రస్ట్ చేస్తున్నటువంటి సేవా కార్యక్రమాల ద్వారా మధురమ్మ మరణించి జీవిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఇన్చార్జి ప్రిన్సిపల్ పి తిరుపతిరెడ్డి, ఇల్లంతకుంట ప్రధానోపాధ్యాయురాలు తజీనీమ్ నజీనీమ్, ఉపాధ్యాయులు సిహెచ్.వేణు, కే. జయప్రకాష్, కే. సత్యం, ఎం. సమిరెడ్డి, ఏ. సురేష్, జె. రాధికా రాణి, డి. ఉమాదేవి, పరమేశ్వర్, మరియు మోడల్ స్కూల్ అధ్యాపక బృందము వి. జయపాల్ రెడ్డి, కే. మనోజ్ కుమార్, ఎం. సురేష్, ఏ. లావణ్య, కే . శ్రీదేవి, ఏ .అశోక్ కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# సీతాఫలాలతో ఆరోగ్యానికి ఎంతో మేలు...



**-ఇస్ క్రీమ్ తయారీలో కీలకంగా మారిన సీతాఫలాలు...**
**-సీతాఫండ్లలోనీ గుజ్జు వెలికి తీత...**
**-తెలుగు రాష్ట్రాల్లో సీతాఫలాలతో నూతన బిజినెస్...**
**-సీతాఫలం గుజ్జును కేజీలుగా పాక్ చేసి జోరుగా విక్రయాలు...**
**-సీతాఫండ్ల గుజ్జుతో డ్రింక్ తయారు...**

**యాదాద్రి భువనగిరి జిల్లా నవంబర్ / 12 / మన వార్త జిల్లా ప్రతినిధి** పెద్దగా ప్రచారం లేక పోయిన సీతా ఫలాలకు ప్రత్యేక స్థానం ఉంది. ఇప్పుడు కొత్తగా తెరపైకి వచ్చిన సీతాఫలాలు ఆరోగ్యానికి



ఎంతో మేలు చేస్తుందని ప్రపంచ ఆరోగ్య నిపుణులు తెలిపారు. ఈ పండ్లులోని గుజ్జును వెలికి తీసి కేజీలుగా పాక్ చేసి తర్వాత ఫ్రిజ్లో నిల్వ ఉంచి అమ్మకాలు జరుపుతున్నారు. ఎక్కువగా ఐస్ క్రీమ్ లు తయారు చేసి విక్రయిస్తున్నారు. అంతే కాకుండా సీతాఫలం గుజ్జుతో డ్రింక్ లు తయారు చేస్తుండడంతో సీతాఫలంకు ప్రత్యేక స్థానం దక్కింది. అలాగే సీతాఫలం గుజ్జు విటమిన్ ఎ , సి యాంటీ ఆక్సిడెంట్లు , పొటాషియం , ఫైబర్ వంటి పోషకాలతో నిండి ఉంటుంది , ఇవి రోగ నిరోధక శక్తిని పెంచడానికి , జీర్ణక్రియకు సహాయ పడటానికి , చర్మం , కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఉపయోగపడతాయి. ఇందులో తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉండటం వల్ల మధుమేహ వ్యాధిగ్రస్తులకు కూడా మేలు చేస్తుందనీ చెప్పక తప్పదు. అలాగే గాయాలు త్వరగా మానడానికి , శక్తిని పెంచడానికి కూడా తోడ్పడుతుంది. సీతాఫలం గుజ్జు ప్రయోజనాలు రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. విటమిన్ ఎ,సి పుష్కలంగా ఉండటం వల్ల శరీరం యొక్క రోగనిరోధక శక్తిని పెంచుతుంది. జీర్ణక్రియకు సహాయ పడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ కంటెంట్ మలబద్ధకం వంటి సమస్యలను తగ్గించి , ప్రేగు కదలికలను ప్రోత్సహిస్తుంది. చర్మం , కంటి ఆరోగ్యం , విటమిన్ సి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉండటం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలలో ఆకస్మిక హెచ్చు తగ్గులు లేకుండా చేస్తుంది.. శక్తిని పెంచుతుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను ఎదుర్కొని , దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. సీతాఫలం జాగ్రత్తలు... మధుమేహ వ్యాధిగ్రస్తులు సీతా ఫలంలో సహజ చక్కెరలు ఉంటాయి , కాబట్టి మధుమేహం ఉన్నవారు మితంగా తీసుకోవాలి. జీర్ణ సమస్యలు అధిక మొత్తంలో తింటే గ్యాస్ , ఉబ్బరం లేదా విరేచనాలు వంటి జీర్ణ సమస్యలు రావచ్చు. బరువు పెరగడం కేలరీలు ఎక్కువగా ఉండే పండు కాబట్టి , బరువు పెరగకుండా చూసు కోవడానికి పరిమాణాన్ని నియంత్రించడంలో సీతా ఫలాలకు ప్రత్యేక స్థానం ఉంది.

# అల్వాల్‌లో విద్యార్థి అదృశ్యం తల్లిదండ్రుల ఆందోళన



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నవంబర్ 12 మన వార్త:** అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రీప్ ఇన్ జాయ్ అక్షరాభ్యాస్ స్పెషల్ స్కూల్లో చదువుకుంటున్న విద్యార్థి అదృశ్యమవడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. ఆదిలాబాద్ జిల్లా హంపోలీ గ్రామానికి చెందిన బయ్యగడే దాకాజీ అనే రైతు తన కుమారుడు బి. సూర్య కాంత్ అల్వాల్‌లోని రీప్ ఇన్ జాయ్ అక్షరాభ్యాస్ స్పెషల్ స్కూల్లో చేర్పించి చదివిస్తున్నాడు. దాకాజీ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం నా కుమారుడు చిన్నతనం నుండి మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. నవంబర్ 9 సాయంత్రం 5 గంటల సమయంలో స్కూల్ నుండి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. స్కూల్ ఇన్‌చార్జ్‌ని అడిగితే ఆయనకు కూడా సమాచారం లేదని చెప్పారు,అని తెలిపారు. ఈ మేరకు అల్వాల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నంబర్ 1146/2025 కింద మిస్సింగ్ కేసు నమోదు చేసి, హెడ్ కానిస్టేబుల్ బిట్టు లక్ష్మణ్ దర్యాప్తు చేపట్టారు. పోలీసులు స్కూల్ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తూ, స్థానికుల సహాయంతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. సూర్యకాంత్ గురించిన సమాచారం తెలిసినవారు అల్వాల్ పోలీస్ తెలియజేయాలని పోలీసులు కోరారు.

# మడుపల్లి బస్తి దవాఖానకి బెడ్ వితరణ

**మధిర,నవంబర్ 12(మన వార్త):** మడుపల్లి బస్తి దవాఖానకి మధిర వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ శీలం వీర వెంకట రెడ్డి బెడ్ ను తన తల్లి భద్రమ్మ జ్ఞాపకార్థం బుధవారం బస్తీ దవాఖానకి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రోగుల కోసం మధిర మున్సిపాలిటీలోని మడుపల్లి




బస్తీ దవాఖానకు ఒక బెడ్‌ను విరాళంగా అందించామన్నారు. అనంతరం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీరాజ్ నాయక్ మాట్లాడుతూ,దాతల సహకారం బస్తి దవాఖాన సేవలు మెరుగుపరచడంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ?సీహెచ్ఓ వెంకటేశ్వరరావు,గోవిందు, ?సరోజినీ, ?బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్ కుసుమ, స్టాఫ్ నర్స్ వెంకట లక్ష్మి, ?సపోర్టింగ్ స్టాఫ్ విజయ కుమార్ పాల్గొన్నారు.

# ఎఫ్ పీ ఓ సంఘం రెండవ వార్షిక సమావేశం...

**జమ్మికుంట, నవంబర్ 12( మన వార్త ప్రతినిధి):** జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో,జమ్మికుంట రైతు ప్రగతి ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం రెండవ వార్షిక సర్వసభ్య సమావేశం జమ్మికుంట రైతు ప్రగతి చైర్మన్ సంద మహేందర్ అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిపాటి విజయ్ గోపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి హాజరై మాట్లాడుతూ




ఎఫ్ పీ ఓ కు ఉన్న అవకాశాల గురించి రైతులకు తెలిపారు. అలాగే రానున్న రోజుల్లో సభ్యత్వం పొందిన ప్రతి రైతుకు స్మార్ట్ కార్డు ద్వారా ఎఫ్ పీ ఓ లో ఇన్పుట్ అందించాలని, అంతే కాకుండా డిజిటల్ మార్కెటింగ్ చేసి లాభాలు పొందాలని, సంస్థ అభివృద్ధిలో సంఘ సభ్యులందరూ భాగస్వాములు కావాలని కోరారు. అలాగే హుజురాబాద్ వ్యవసాయ సహాయ సంచాలకులు సునీత మాట్లాడుతూ ఎఫ్ పీ ఓ లో ప్రస్తుతం ఉన్న ఇన్పుట్ బిజినెస్ తో పాటు ఔట్ పుట్ బిజినెస్ చేసి లాభాలు పొందాలని, రైతులకు ఎలాంటి సలహాలు సూచన కావాలన్నా సంప్రదించవచ్చని, అన్నివేళలా అందుబాటులో ఉంటామని చెప్పారు. జమ్మికుంట మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్ మాట్లాడుతూ ఎఫ్ పీ ఓ కి రబీ సీజన్ లో ఫర్టిలైజర్ రైతులందరికీ అందేలా ఏర్పాటు చేస్తామని చెప్పారు. జమ్మికుంట రైతు ప్రగతి చైర్మన్ సంద మహేందర్ మాట్లాడుతూ సంఘ సభ్యులు అందరూ కూడా ఇన్పుట్ బిజినెస్ మన సంఘంలోనే చేయాలని, తక్కువ ధరలకు ఇన్పుట్ అందిస్తామని తెలిపారు. జమ్మికుంట రైతు ప్రగతి యొక్క ముఖ్య కార్యనిర్వహణాధికారి సాగర్ మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదిక ను మహా సభలో సభ్యులందరికీ తెలిపినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కే వీ కే సీనియర్ శాస్త్రవేత్త డా. ఎన్. వెంకటేశ్వర్ రావు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, జమ్మికుంట రైతు ప్రగతి చైర్మన్, డైరెక్టర్స్, సీ ఇ ఓ అకౌంటెంట్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలకు చిన్నారులకు టీకాలు వేసిన వైద్య సిబ్బంది...



**నిజాంపేట నవంబర్ 12( మన వార్త ప్రతినిధి)** నిజాంపేటమండల పరిధిలోని నస్కల్ ఆరోగ్య కేంద్రంలో బుధవారం గర్భిణీ స్త్రీలకు,పుట్టిన 5 ఏళ్ల లోపు గల పిల్లలకు టీకాలు వేయడం జరుగుతుందని ఏఎన్ఎంరేణుక,గౌరీ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో గర్భిణీ స్త్రీలకు పుట్టిన పిల్లలకు ప్రతి బుధవారం టీకాలు వేస్తున్నామని చిన్నారులను బరువు గర్భిణీ స్త్రీలకు కావలసిన మందులను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు సంతోష,పుష్ప,మమత,రేఖ, గర్భిణీ స్త్రీలకు తదితరులు ఉన్నారు.

# బాంబు స్క్వాడ్, నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు...



**నిజాంపేట నవంబర్ 12( మన వార్త ప్రతినిధి)** నిజాంపేట మండల కేంద్రంలో బుధవారం పలు దుకాణాలలో డాగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బాంబు స్క్వాడ్ విత్ డాగ్ తో సహా రద్దీగా ఉన్నటువంటి దుకాణాలలో తనిఖీలు చేపట్టామని. గ్రామాలలో గంజాయి మాదకద్రవ్యాలు మత్తు పదార్థాల రవాణా ను అరికట్టేందుకు పోలీస్ శాఖ ఉక్కుపాదం వేస్తుందన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు అమ్మినట్లయితే అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది బాంబు స్క్వాడ్ అధికారులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి...



**నిజాంపేట నవంబర్ 12( మన వార్త ప్రతినిధి)** నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన బక్కన్న గారి లాల గౌడ్, కరెంట్ షాక్ తో మృతి చెందడం జరిగింది. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే బచ్చు రాజు పల్లి గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ బోడపట్ల మల్లేశం తండ్రి బుడపట్ల ఎర్ర మల్లయ్య(80) అనారోగ్యంతో మరణించగా మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, అంత్యక్రియలో పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండలఅధ్యక్షులు పరిపాటి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ బిజ్జాసంపత్, మాజీ సొసైటీ చైర్మన్ కిష్టారెడ్డి,మాజీ కోఆప్షన్ సభ్యులు గౌస్, అబ్దుల్ అజీజ్, వెంకట స్వామి గౌడ్, నగేష్, అస్సుద్దిన్, శ్రీనివాస్, రాజు,అంజయ్య,నరేందర్ నాయక్,సుభాష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# క్వింటాల్ పత్తి 7000 పలికింది...



**జమ్మికుంట,నవంబర్ 12( మన వార్త ప్రతినిధి):** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తికి బుధవారం రూ 7,000 పలికింది. 95 వాహనాలలో 776 క్వింటాల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. మోడల్ ధర రూ 6,700, కనిష్ట ధర రూ. 6100 పలికింది. సంచులలో పత్తిని 12 మంది రైతులు 19 క్వింటాలు విక్రయానికి తీసుకొని వచ్చారు. గరిష్ఠ ధర రూ 6,100, మోడల్ ధర రూ 6000,కనిష్ట ధర రూ 5500 కు వ్యాపారులు కొనుగోలు చేశారు. కొనుగోళ్లను మార్కెట్ చైర్పర్సన్ పుల్లూరి స్వప్నా సదానందం,కార్యదర్శి పరిశీలించారు.

# అనారోగ్యంతో ఈ పంచాయతీ ఆపరేటర్ లక్ష్మణ్ మృతి...

**చిన్న శంకరంపేట నవంబర్ 12( మన వార్త ప్రతినిధి)** చిన్న శంకరంపేట మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ



ఆపరేటర్ గా చిన్న శంకరంపేట మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ పంచాయతీ ఆపరేటర్ గా పనిచేస్తున్న మంగలి లక్ష్మణ్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు, లక్ష్మణ్ మృతితో అంబాజీపేట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి, గత కొన్ని సంవత్సరాలుగా మండల పరిషత్ కార్యాలయంలో ఆపరేటర్ గా పనిచేస్తున్నాడు ఆరునెల క్రితం అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు లక్ష్మణ్(30) మృతితో ఎంపీపీ కార్యాలయం ఆవరణలో ఆయన చిత్రపటానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు నివాళులర్పించారు, ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దామోదర్, తహశీల్దార్ మాలతి, ఎంపిఓ గిరిజారాణి, ఏపీవో రాజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు అంబాజీపేట గ్రామంలో జరిగిన అంత్యక్రియలలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య పాల్గొన్నారు.

## ఈనెల 30న కల్లూరులో జరిగే టీ ఎస్ యూ టీ ఎఫ్ ఖమ్మం జిల్లా సమావేశాన్ని జయప్రదం చేయండి



**మధిర,నవంబర్ 12(మన వార్త):** ఈనెల 30న ఖమ్మం జిల్లా కల్లూరులో జరిగే తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశాన్ని సభ్యుల అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు షేక్ రంజాన్,జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలి పిలుపునిచ్చారు. బుధవారం మధిర టీ ఎస్ యూ టీ ఎఫ్ కార్యనియంలో ఆ సంఘం మండల అధ్యక్షులు బండారు నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ,కల్లూరు కేంద్రంగా జరుగుతున్న విస్తృత కార్యవర్గ సమావేశంలో సంఘం రాష్ట్ర నేతల పాల్గొని సంవత్సర కాలం పాటు సంఘ కార్యక్రమాల నివేదిక, తీర్మానాలు,విద్యారంగ సమీక్ష ఎజెండాగా నిర్ణయిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులంతా తప్పక హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ వినోద రావు,వీరయ్య,షేక్ ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

# ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దగ్ధం



**మల్యాల, నవంబర్ 12(మన వార్త ప్రతినిధి)** మల్యాల మండల బిజెపి అధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలోని పార్టీ శ్రేణులు బుధవారం స్థానిక అంగడి బజార్లో పాకిస్తాన్ కు చెందిన ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఎర్రకోట వద్ద జరిగిన బాంబు పేలుళ్లకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు పార్టీ శ్రేణులు పేర్కొన్నారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల్లారా ఖబర్దార్ అంటూ దిష్టిబొమ్మకు నిప్పంటించి తమ నిరసన తెలిపారు. అనంతరం పేలుళ్లలో మృతి చెందిన వారికి సంతాపంగా కొవ్వొత్తులతో నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో బొట్ల ప్రసాద్, జనగాం రాములు, బొబ్బిలి వెంకటస్వామి యాదవ్, బండారి రాజు, నీలం రవి, రమ, చక్రం గౌడ్ తదితరులు ఉన్నారు.

# స్కూల్ బస్సులో చెలరేగిన మంటలు



**-తప్పిన పెను ప్రమాద...**

**నార్సింగి నవంబర్ 12( మన వార్త ప్రతినిధి )**ప్రమాదవశాత్తు ప్రైవేట్ స్కూల్ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి పెను ప్రమాదం తప్పిన ఘటన బుధవారం సాయంత్రం నార్సింగి మండల కేంద్రంలో చోటుచేసుకుంది.రామాయంపేటకు చెందిన అక్షర టెక్నో స్కూల్ బస్సు రోజు మాదిరిగానే విద్యార్థులను వారి గమ్యస్థానాలకు చేర్చి నార్సింగిలోని వేణుగోపాల స్వామి ఆలయం వద్ద పార్కు చేశారు. సాయంత్రం పార్కింగ్ చేసిన బస్సులో బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించాయి.స్థానికుల సమాచారం తో ఫైర్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ప్రమాద సమయంలో బస్సులో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

# పేకాట రాయుళ్లను పట్టుకున్న పోలీసులు...

**జమ్మికుంట, నవంబర్ 12( మన వార్త ప్రతినిధి):**పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతి కుమార్ తెలిపారు.ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నకోమటి పల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఇల్లందకుంట ఎస్సై క్రాంతికుమార్ పోలీస్ సిబ్బంది తో పట్టుకుని వారిపై కేసు నమోదు చేశారు. వారి వద్దనుండి రూ 18,300 నగదు స్వాదినం చేసుకున్నారు. చట్టావ్యతిరేకంగా పేకాట ఆడితే వారిపై చట్ట పరంగా చర్య తీసుకుంటామని హెచ్చరించారు.

# రోడ్డు ప్రమాదంలో మరణించిన ముగ్గురు కుమార్తెల కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం



**-అందజేసిన మొయినాబాద్ మండల గౌడ సంఘం సభ్యులు...**

**మొయినాబాద్ నవంబర్ 12:మన వార్త ప్రతినిధి**

మొయినాబాద్ మున్సిపాలిటీ మండల గౌడ సంఘం తరపున గౌడకుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు రేనట్ల మల్లేష్ గౌడ్ అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర జిల్లా అధ్యక్షులు సిద్ధంతి నరసింహాగౌడ్ బసవపురం అంజయ్యగౌడ్హౌహౌఆధ్వర్యంలో పెర్కంపల్లి గ్రామానికి చెందిన ఎల్లయ్య గౌడ్ ముగ్గురు కుమార్తెలు రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. వారి కుటుంబ సభ్యులను కలిసిన సంఘ సభ్యులు పరామర్శించారు. వారి సభ్యులకు ఆర్థిక సాయం అందజేసిన గ్రామాలు చిలుకూరు,ఎంకేపల్లి, నక్కలపల్లి, చాకలి గూడెం, సురంగల్, హిమాయత్ నగర్,హౌగౌడ సంఘం ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులకు 43000 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు గ్రామానికి చెందిన గౌడ సంఘం అధ్యక్షుడు సుభాష్ గౌడ్ 15000 ఎంకేపల్లి అధ్యక్షుడు 10,000 నక్కలపల్లి గౌడ సంఘం 5000 చాకలి గూడెం రేనట్ల దర్శన్ గౌడ్ గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి జాతీయ కార్యదర్శి 10,000 సురంగల అశోక్ గౌడ్ రెండు 2000 హిమాయత్ నగర్ రాజు గౌడ్ వెయ్యి రూపాయలు మొత్తం 43 వేల రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు.

# చంద్రబాబు వంచనపై యువత ఆగ్రహం

- **చిత్తూరులో వైయస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ...**
- **17 మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ యత్నాన్ని ఖండించిన విద్యార్థులు...**
- **ప్రజా ఆస్తులను బినామీలకు కట్టబెట్టే కుట్రపై ఆందోళన...**
- **నిర్ణయాన్ని ఉపసంహరించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరిక...**

**(చిత్తూరు, నవంబర్ 12):**ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ పథకంలోకి తేవాలనే ప్రభుత్వ నిర్ణయంపై వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. చిత్తూరులో పార్టీ ఇంచార్జ్ విజయానందరెడ్డి నేతృత్వంలో విద్యార్థులు, యువత, మహిళలు, వైయస్ఆర్ సీపీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. గంగినేని చెరువు వద్ద ప్రారంభమైన ఈ ర్యాలీ ఆర్డీవో కార్యాలయం వరకు సాగింది. పాల్గొన్న ప్రజలు "మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ రద్దు చేయాలి'' అంటూ గట్టిగా నినదించారు.ర్యాలీలో వైయస్ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. "స్వాతంత్ర్య భారత చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా 17 మెడికల్ కాలేజీలను సాధించి జాతికి అంకితం చేసిన వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు. ఈ కాలేజీలను చంద్రబాబు తన బినామీలకు కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజా సంపదను వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగించాలనే కుట్రను రాష్ట్ర ప్రజలు అంగీకరించరు" అని మండిపడ్డారు.ఇంకా విజయానందరెడ్డి మాట్లాడుతూ, పీపీపీ విధానం పేరుతో మెడికల్ కాలేజీలను ప్రైవేటు రంగానికి అప్పగించడం అనేది పేద విద్యార్థులపై తీవ్రమైన అన్యాయం అని తెలిపారు. వైయస్ఆర్ సీపీ ప్రభుత్వం విద్య, వైద్య రంగాల్లో ప్రజా సంక్షేమం కోసం పని చేసిందని గుర్తుచేస్తూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం పేదల ఆశలపై నీళ్లు చల్లుతోందని విమర్శించారు.ప్రజా ప్రయోజనాలను పక్కనబెట్టి, వ్యక్తిగత లాభాల కోసం ప్రభుత్వ నిర్ణయాలు తీసుకుంటే వైయస్ఆర్ సీపీ నిరసనలు మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ ర్యాలీ చిత్తూరులో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించింది.



# వినే నాయకుడు, స్పందించే మంత్రి పవన్ కళ్యాణ్ హ్యూమన్ టచ్‌తో ప్రజల్లో ఆదరణ

- **ప్రజల సమస్యలపై తక్షణ స్పందన, పరిష్కారమే లక్ష్యం**
- **తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనలో పేద మహిళకు సహాయం**
- **విని చూపే నాయకత్వంతో కొత్త ప్రమాణం సృష్టించిన పావన్ కళ్యాణ్**

**:( మన వార్త ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పావన్ కళ్యాణ్ పర్యటనల్లో ప్రజలతో మమకారంతో మెలగడం, వారి సమస్యలను విన్న వెంటనే స్పందించడం ద్వారా తన నాయకత్వ శైలిని మరోసారి చాటుకున్నారు. "విని పరిష్కరించే" నాయకుడిగా ఆయన ప్రజల్లో మన్ననలు పొందుతున్నారు. ప్రజల సమస్య ఎంత చిన్నదైనా, ఎంత పెద్దదైనా ఆయన స్వయంగా పరిశీలించి పరిష్కారం వచ్చే వరకు పర్యవేక్షించడం ప్రజలకు విశ్వాసాన్ని కలిగిస్తోంది.ఇటీవల కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో తుపాను ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన సందర్భంగా పావన్ కళ్యాణ్ ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడారు. పులిగడ్డ వద్ద ఒక మహిళ, శ్రీమతి చెన్ను అనూష తన బాధను వివరించారు. భర్తను కోల్పోయి ఆధారం లేక కష్టాల్లో ఉన్నానని ఆమె చెప్పడంతో పావన్ కళ్యాణ్ తక్షణమే జిల్లా కలెక్టర్‌కు ఆమెకు విధవరాలిగా పెన్షన్ మంజూరు చేయాలని ఆదేశించారు.పావన్ కళ్యాణ్ సూచన మేరకు కేవలం రెండు వారాల్లోనే ఆ మహిళకు పెన్షన్ మంజూరైంది. ఇది ఆయన ప్రజా సేవా దృక్పథానికి ప్రతీకగా నిలిచింది. ప్రజల కష్టాల పట్ల ఆయన చూపిన సానుభూతి, నిర్ణయాల్లో చూపిన వేగం ప్రజల్లో విశేషమైన అభినందనలను రేకెత్తించాయి. శ్రీమతి అనూష కృతజ్ఞతలు తెలుపుతూ.. "అయన నా బాధ విన్నారు మాత్రమే కాదు, పరిష్కరించారు కూడా. ఇంత పెద్ద మనసు గల నాయకుడిని చూసి హృదయం నిండిపోయింది" అని అన్నారు.ప్రజా సమస్యలను వినడం, వెంటనే స్పందించడం, ఫలితాలు సాధించడం ఇదే పావన్ కళ్యాణ్ నాయకత్వం యొక్క ప్రత్యేకతగా నిలుస్తోంది. కరుణతో కూడిన పరిపాలన, ప్రజా బాధ్యతతో కూడిన స్పందనతో ఆయన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త ప్రమాణాన్ని సృష్టిస్తున్నారని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు ప్రశంసిస్తున్నారు.



# గత ప్రభుత్వంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం

- **పేదలందరికీ 2029 నాటికి సొంతిల్లు లక్ష్యం...**
- **ముస్లింలకు రూ.50 వేల అదనపు సాయం ప్రకటన...**

**(రాయచోటు, అన్నమయ్య జిల్లా, నవంబర్ 12):**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం అన్నమయ్య జిల్లా రాయచోటులో జరిగిన ప్రజావేదిక సభలో గృహనిర్మాణ రంగంపై గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "గృహ నిర్మాణ రంగాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేశారు" అంటూ ఆయన మండిపడ్డారు. 2029 నాటికి రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేద కుటుంబం ఒక్కటీ మిగలకూడదని, ప్రతి ఒక్కరికీ సొంతిల్లు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "పేదలకు ఇళ్లు కట్టిస్తామని చెప్పి, మాట నిలబెట్టుకోకపోవడమే కాదు, రూ.900 కోట్ల బిల్లులు కూడా ఎగ్గొట్టారు. వేము ఆ బకాయిలను చెల్లిస్తాం" అని సీఎం తెలిపారు. "తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం వరకు దేశంలో పేదలకు పక్కా ఇళ్లు కట్టించాలన్న ఆలోచన ఎవరికీ రాలేదు. ఎన్టీఆర్ 'కూడు, గూడు, గుడ్డ' నినాదంతో ఆ కలను సాకారం చేశాడు. కానీ గత ప్రభుత్వం పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలం ఇచ్చి చేతులు దులుపుకుంది. చదును పేరుతో కోట్లు దోచుకున్నారు" అంటూ ఆయన విమర్శించారు. పేదలకు ఉచితంగా ఇవ్వాల్సిన ఇసుకను "పందికొక్కుల్లా తిన్నారు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.– ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్త రావాలన్న ఆకాంక్ష ప్రతి కుటుంబం ఉద్యోగాలు వెతుక్కునే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. "ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేసి, మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతాం. డ్వాక్రా మహిళలు రూ.50 వేల కోట్ల రుణాలు తీసుకుని బాధ్యతగా చెల్లిస్తున్నారు. వారిని ప్రోత్సహించి, వ్యాపారవేత్తలుగా తయారు చేస్తాం" అని భరోసా ఇచ్చారు.– ముస్లింలకు అదనపు సాయం, ఆధునిక సౌకర్యాలతో ఇళ్లు పేదల ఇళ్ల నిర్మాణంలో ముస్లింలకు రూ.50 వేల అదనపు సాయం అందిస్తామని చంద్రబాబు ప్రకటించారు. దీని వల్ల దాదాపు 6 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. భవిష్యత్తులో నిర్మించే ఇళ్లను ఆధునిక సౌకర్యాలతో అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. "ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యం కల్పిస్తాం. ఉగాది నాటికి మరో 5.9 లక్షల గృహప్రవేశాలు చేస్తాం. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి నీరు అందిస్తాం" అని చెప్పారు.




# శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో విషాదం



- **ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్యతో కలకలం...**
- **ఎచ్చెర్ల పోలీసులు దర్యాప్తు ప్రారంభం...**

**(శ్రీకాకుళం, నవంబర్ 12) :**శ్రీకాకుళం జిల్లాలోని ట్రిపుల్ ఐటీలో ఘోర విషాదం చోటుచేసుకుంది. రాజీవ్ గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం పరిధిలోని ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ప్రత్తిపాటి సృజన్ (20) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన విద్యార్థుల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసుల వివరాల ప్రకారం, సృజన్ తన హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్నేహితులు గదిలోకి వెళ్లినప్పుడు సృజన్ ఉరేసుకున్న స్థితిలో కనబడటంతో వెంటనే ట్రిపుల్ ఐటీ అధికారులను సమాచారం అందించారు. అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలు స్పష్టంగా తెలియరాలేదు. వ్యక్తిగత సమస్యలేనా, చదువు ఒత్తిడేనా అన్న దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సృజన్ గుంటూరు జిల్లాకు చెందినవాడని గుర్తించారు. స్నేహితులు, ఉపాధ్యాయులు ఈ ఘటనతో దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థుల భద్రత, మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యార్థి తల్లిదండ్రులు, సహచరులు కోరుతున్నారు. ఈ ఘటన మరోసారి విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిపై చర్చను తెరపైకి తెచ్చింది.

# చైనాకి భారత జనరిక్ ఔషధాలు



**ముంబై,** ఇన్నాళ్లూ భారత ఔష?ధ కంపెనీలకు ప్రవేశం నిరాకరించిన చైనా క్రమంగా నిబంధనలు సడలిస్తోంది. భారత ఔషధాలకు ముఖ్యంగా జనరిక్ ఔషధాలకు తలుపులు తెరుస్తోంది. అయితే ఈ అవకాశాన్ని భారత ఫార్మా కంపెనీలకు చెందిన చైనా అనుబంధ కంపెనీలకు మాత్రమే ప్రస్తుతం పరిమితం చేసింది. గత నెల చైనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఒక టెండర్‌లో చైనాలోని సిప్లా, నాట్కో ఫార్మా, హెటెరో ల్యాబ్స్, అన్నోర ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ వంటి భారత ఔషధ కంపెనీల అనుబంధ సంస్థలు ప్రభుత్వ నిర్వహణలోని ఆస్పత్రులకు తమ జనరిక్ ఔషధాలను సరఫరా చేసే కాంట్రా క్టు దక్కించుకున్నాయి. ఇందులో భాగంగా సిప్లాతో పాటు హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే నాట్కో ఫార్మా, అన్నోర ఫార్మా, హెటరో ల్యాబ్స్ వంటి ఏడు భారత ఫార్మా కంపెనీల అనుబంధ సంస్థలు మధుమేహ నియంత్రణకు వాడే 'డపాగ్లిఫ్లోజిన్' అనే జనరిక్ టాబ్లెట్లను 100 కోట్ల వరకు చైనాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు సరఫరా చేయబోతున్నాయి.వీబీపీ పద్దతిలో : చైనా ప్రభుత్వం వాల్యూమ్ బేస్డ్ ప్రొక్యూర్‌మెంట్ (వీబీపీ) పద్దతిలో ఈ ఔ?షధాలను కొనుగోలు చేస్తోంది. ఈ పద్దతిలో తక్కువ ధర కోట్ చేసి ఎంపికైన ఫార్మా కంపెనీలు చైనాలోని నిర్దేశిత రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులకు తమ జనరిక్ ఔషధాలను సరఫరా చేయాల్సి ఉంటుంది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే అన్నోరా ఫార్మా, నాట్కో ఫార్మా కంపెనీల చైనా అనుబంధ కంపెనీలు కూడా ఈ బిడ్‌లో పాల్గొని ఆక్స్‌కార్బాజెపైన్, ఒలాపారిబ్ టాబ్లెట్లు సరఫరా చేసే కాంట్రాక్టు సంపాదించాయి. ఈ రెండు టాబ్లెట్లను మూర్ఛ వ్యాధి, కొన్ని రకాల కేన్సర్ చికిత్సలో ఉపయోగిస్తారు. చైనాలోని డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ అనుబంధ సంస్థ కున్షన్ రోటం రెడ్డి ఫార్మాస్యూటికల్ కంపెనీ కూడా నాలుగు రకాల జనరిక్ ఔషధాలకు చైనాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు సరఫరా చేయనుంది. ఇన్ఫెక్షన్లు, ట్యూమర్లు, అలెర్జీల వంటి రుగ్మతల చికిత్సలో ఈ ఔషధాలను ఉపయోగిస్తారు.ఫలిస్తున్న ఒత్తిడి: గత ఏడాది చైనా ఔషధ మార్కెట్ 25,237 కోట్ల డాలర్లుగా (సుమారు రూ.22.37 లక్షల కోట్లు) నమోదైంది. ఇందులో బహుళ జాతి కంపెనీలు, స్థానిక కంపెనీలదే హవా. దీనికి తోడు వీబీపీ పద్దతిలో కొనే ఔషధాలకు చైనా ప్రభుత్వం అతి తక్కువ ధర నిర్ణయిస్తోంది. దీంతో ఇప్పటి వరకు భారత ఫార్మా కంపెనీలు చైనా మార్కెట్‌ను పెద్దగా పట్టించుకోలేదు. చైనా అనుసరిస్తున్న వాణిజ్యేతర రక్షణ విధానాలు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. అయితే వీబీపీ పద్దతిలో చైనా ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఔషధాలు కొనుగోలు చేయడం భారత ఫార్మా కంపెనీలను ఆకర్షిస్తోంది. ద్వైపాక్షిక వాణిజ్యంలో చైనాకు పెరిగిపోతున్న మిగులు కేంద్ర ప్రభుత్వాన్ని ఆందోళనకు గురి చేస్తోంది. దీంతో మీ ఫార్మా మార్కెట్‌ను మా కంపెనీలకు తెరుస్తారా...లేదా లేకపోతే మేము కూడా మీ కంపెనీలకు దడి కట్టాల్సి వస్తుందని కేంద్రప్రభుత్వం చైనాను హెచ్చరిస్తోంది. దీంతో చైనా తన దేశంలోని భారత ఫార్మా అనుబంధ కంపెనీలను మాత్రమే తన ప్రభుత్వ ఆస్పత్రులకు జనరిక్ ఔషధాలు సరఫరా చేసేందుకు పాక్షికంగా అనుమతించిందని భావిస్తున్నారు.రూ.10,096 కోట్ల మార్కెట్ వీబీపీ పద్దతిలో చైనా ప్రభుత్వం ఏడు రకాల జనరిక్ ఔషధాలను కొనుగోలు చేయనుంది. ఇందులో మధుమేహ నియంత్రణకు వాడే 'డపాగ్లిఫ్లోజిన్' జనరిక్ టాబ్లెట్ల మార్కెట్టే 114 కోట్ల డాలర్ల (సుమారు రూ.10,096 కోట్లు) వరకు ఉంది. ఇందులో గత ఏడాది 70 కోట్ల డాలర్ల విలువైన టాబ్లెట్లను చైనాలోని ప్రభుత్వ ఆస్పత్రులే కొనుగోలు చేశాయి.

# టఫే కొత్త ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ట్రాక్టర్




**న్యూఢిల్లీ,** భారత వ్యయసాయయంత్రాల తయారీ దిగ్గజం ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విపమెంట్ లిమిటెడ్ (టఫే) కొత్త తరం ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ట్రాక్టర్ 'ఈవీఎక్స్ 75'ను విడుదల చేసింది. జర్మనీలో జరుగుతున్న అగ్రిటెక్నికా–2025 ప్రదర్శనలో ఈ కొత్త మోడల్‌ను కంపెనీ ఆవిష్కరించింది. 75 హెచ్‌పీ హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్, ఈయూ స్టేజ్–5 డీజిల్ ఇంజన్, 400 వోల్ట్ ఎలక్ట్రిక్ బ్యాటరీ సిస్టమ్‌తో రూపొందించినట్లు టఫే తెలిపింది. లిక్విడ్ కూల్డ్ హై–వోల్టేజ్ సిస్టమ్, 3–స్పీడ్ ట్రాన్స్‌మిషన్ (గరిష్ట వేగం గంటకి 40 కి.మీ), ఫుల్ హెచ్‌వీఏసీ క్యాబిన్, ఎలక్ట్రో–హైడ్రాలిక్ రియర్ లిఫ్ట్, ఇండిపెండెంట్ పీటీవో వంటి ఫీచర్లతో ఈ కొత్త ట్రాకర్ట్ వస్తున్నట్టు కంపెనీ వైస్ ఛైర్మన్ డా. లక్ష్మీ వేణు తెలిపారు.

# మార్కెట్లలోకి 'గ్రో' గ్రాండ్ ఎంట్రీ...




**న్యూఢిల్లీ,** స్టాక్ బ్రోకింగ్ సంస్థ గ్రో పేరెంట్ కంపెనీ బిలియన్ బ్రెయిన్స్ గ్యారేజ్ వెంచర్స్ స్టాక్ ఈరోజు స్టాక్ మార్కెట్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. అంచనాలను అందుకుంటూ ఈ కంపెనీ షేర్లు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీలో ఇవాళ 14 శాతం ప్రీమియంతో దలాల్ స్ట్రీట్‌లోకి అడుగు పెట్టాయి. ఈ గ్రో ఐపీఓ ఇష్యూ ధర రూ.100తో పోలిస్తే ఎన్ఎస్ఈలో 12 శాతం ప్రీమియంతో రూ.112 వద్ద ట్రేడింగ్ ప్రారంభించగా, ఇక బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీలో రూ. 114 వద్ద లిస్టయ్యాయి.గ్రో పబ్లిక్ ఇష్యూకు సబ్‌స్క్రిప్షన్‌లో మంచి ఆదరణ లభించింది. ఐపీఓ గరిష్ఠ ధర వద్ద రూ. 6,632 కోట్ల నిధులు సమీకరించే లక్ష్యంగా పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. ఈ పబ్లిక్ ఇష్యూ నవంబర్ 4వ తేదీన సబ్‌స్క్రిప్షన్ మొదలు పెట్టింది. మొత్తం ఈ ఐపీఓలో 36.47 కోట్ల షేర్లను విక్రయించింది. అయితే, ఐపీఓ సబ్‌స్క్రిప్షన్‌లో ఇన్వెస్టర్ల నుంచి విశేషమైన స్పందన లభించింది. 36.47 కోట్ల షేర్లు అందుబాటులో ఉంటే ఏకంగా 641.86 కోట్ల షేర్ల కోసం బిడ్లు దాఖలు చేయడమే ఇందుకు నిదర్శనం.గ్రో ఐపీఓ ఒక్కో షేరు ధర (ప్రైస్ బ్యాండ్) రూ. 95 నుంచి రూ. 100గా కంపెనీ నిర్ణయించింది. గరిష్ఠ ధర వద్ద రూ. 6,632 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పబ్లిక్ ఇష్యూలో భాగంగా రూ. 1060 కోట్లు విలువైన ఫ్రెష్ షేర్లను జారీ చేసింది. అలాగే ఆఫర్ ఫర్ సేల్ (ప్రమోటర్ల వాటా విక్రయం) ద్వారా 55.73 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచింది. ఇక సబ్‌స్క్రిప్షన్ వివరాలు చూసుకుంటే రిటైల్ విభాగంలో 9.43 రెట్లు ఓవర్ సబ్‌స్క్రిప్షన్ అందుకోగా నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటాలో 14.20 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఇక క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కేటగిరీలో 22.02 రెట్ల మేర ఓవర్ సబ్‌స్క్రిప్షన్స్ వచ్చాయి.

# లోన్ తీసుకున్నవారికి శుభవార్త ఈఎంఐలు తగ్గనున్నాయి




**న్యూఢిల్లీ,** ఈ బ్యాంకులో హోమ్ లోన్ తీసుకున్న వారికి అదిరే శుభవార్త. వివిధ రుణాలకు సంబంధించిన మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లను ఈ ప్రభుత్వ బ్యాంక్ తగ్గించింది. అన్ని టెన్యూర్లపై 5 బేసిస్ పాయింట్ల మేర తగ్గించినట్లు తెలిపింది. నవంబర్ 12, 2025 నుంచే సవరించిన వడ్డీ రేట్లను అమలులోకి తీసుకొచ్చినట్లు తెలిపింది. దీంతో లోన్ ఈఎంఐలు ఒక్కసారిగా దిగిరానున్నాయి. అలాగే బ్యాంక్ ఆఫ్ బరోడా, ఐడీబీఐ బ్యాంకులు ఎంసీఎల్ఆర్ రేట్లను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు ప్రకటించాయి. దేశంలోని ప్రభుత్వ రంగ దిగ్గజ బ్యాంకుల్లో ఒకటైన కెనరా బ్యాంక్ తమ కస్టమర్లకు అదిరే శుభవార్త అందించింది. రుణాల భారాన్ని తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. వివిధ రుణాలకు లింక్ అయి ఉండే మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్లు (ఎంసీఎల్ఆర్) అన్ని టెన్యూర్ల రుణాలపై 5 బేసిస్ పాయింట్ల మేర తగ్గిస్తున్నట్లు వెల్లడించింది. ఫ్లోటింగ్ రేట్ వడ్డీతో పర్సనల్ లోన్, ఆటో లోన్, హోమ్ లోన్ తీసుకున్న వారికి నెలవారీ ఈఎంఐ ల భారం తగ్గనుంది. ఇక సవరించిన కొత్త ఎంసీఎల్ఆర్ రేట్లను నవబంర్ 12, 2025 నుంచే అమలులోకి తీసుకొచ్చినట్లు కెనరా బ్యాంక్ తెలిపింది.ఎంసీఎల్ఆర్ రేటు ఏంటి?మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు అనేది, హోమ్ లోన్స్, పర్సనల్ లోన్స్, వెహికల్ లోన్స్ వంటి వివిధ రుణాలు ఫ్లోటింగ్ రేటుతో తీసుకునే వడ్డీని నిర్ణయించేందుకు బ్యాంకులు బెంచ్‌మార్క్ రేటుగా ఉపయోగిస్తాయి. ఎంసీఎల్ఆర్ రేటు కన్నా తక్కువకు రుణాలు ఇవ్వరు. ఎంసీఎల్ఆర్ రేటు తగ్గినప్పుడు రుణాల నెలవారీ వాయిదాల భారం తగ్గుతుంది. లేదా లోన్ టెన్యూర్ తగ్గించుకోవచ్చు. దీంతో రుణ గ్రహీతలకు దీర్ఘకాలంలో పెద్ద ప్రయోజనం చేకూరుతుంది.

## 2027 తర్వాత మరో ఐసీసీ టోర్నీకి కోహ్లీ, రోహిత్?



**ముంబై,** భారత క్రికెట్ అభిమానులకు శుభవార్త! క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ బ్యాటింగ్ ద్వయంగా పేరొందిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ.. 2027 వన్డే ప్రపంచ కప్ తర్వాత కూడా ఒక కీలక ఐసీసీ (ICC) టోర్నమెంట్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంది. ఈ ఇద్దరు దిగ్గజాలు కేవలం 2027 వన్డే ప్రపంచ కప్‌ను మాత్రమే లక్ష్యంగా పెట్టుకున్నారని భావిస్తున్న తరుణంలో, వారి కెరీర్ ప్రణాళికలు అంతకు మించి కూడా కొనసాగవచ్చని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, ఐసీసీ వన్డే సూపర్ లీగ్‌ను పునరుద్ధరించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఐసీసీ కీలక నిర్ణయం తీసుకుంటే, ఐసీసీ వన్డే సూపర్ లీగ్ ప్రారంభించే అవకాశం ఉంది. ఇదే నిజమైతే, రోహిత్, కోహ్లీలు మరో ఐసీసీ టోర్నీలో పాల్గొనే ఛాన్స్ ఉందన్నమాట. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ 50 ఓవర్ల ఫార్మాట్‌పై ఆసక్తిని పునరుద్ధరించడానికి వన్డే సూపర్ లీగ్‌ను తిరిగి ప్రారంభించేందుకు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఐసీసీ ఇటీవలి త్రైమాసిక సమావేశంలో ఈ ప్రతిపాదన చర్చకు వచ్చింది. 2023 ప్రపంచ కప్ తర్వాత నిలిపివేసిన ఈ లీగ్‌ను తిరిగి ప్రవేశపెట్టే దిశగా ఇది మొదటి అడుగు. ముఖ్యంగా, భారతదేశంలో జరిగిన 2023 ప్రపంచ కప్‌కు క్వాలిఫికేషన్ మార్గంగా ఐసీసీ 2020లో వన్డే సూపర్ లీగ్‌ను ప్రారంభించింది. 12 పూర్తి స్థాయి సభ్యులు, నెదర్లాండ్స్‌తో సహా 13 జట్లతో కూడిన ఈ లీగ్, అంతర్జాతీయ కట్టుబాట్ల కారణంగా కేవలం ఒక సైకిల్ తర్వాత నిలిపివేశారు. 50 ఓవర్ల క్రికెట్‌కు ఊపిరి పోసేందుకు ఐసీసీ ప్రయత్నం. వన్డే సూపర్ లీగ్ సమయంలో, ప్రతి జట్టు నాలుగు హోమ్, నాలుగు విదేశీ సిరీస్‌లతో సహా మొత్తం ఎనిమిది మూడు మ్యాచ్‌ల సిరీస్‌లు ఆడాల్సి ఉంటుంది. టాప్ ఏడు జట్లు 2023 ప్రపంచ కప్‌నకు నేరుగా అర్హత సాధించగా, మిగిలిన జట్లు అదనపు క్వాలిఫైయర్స్‌లో పోటీపడతాయి. అయితే, టీ20 క్రికెట్ వృద్ధి, ఫ్రాంచైజీ లీగ్‌ల ఆధిపత్యం పెరగడం వల్ల అంతర్జాతీయ క్యాలెండర్‌లో ఇతర ఫార్మాట్‌లకు తక్కువ స్థానం లభించింది. ప్రకారం, ఐసీసీ కొత్తగా సూపర్ లీగ్‌ను పునరుద్ధరించాలని యోచిస్తోంది. సవరించిన ఫార్మాట్‌లో, టీ20 టోర్నమెంట్‌లతోపాటుగా విండోలను సర్దుబాటు చేయవచ్చు. ఇది అన్ని దేశాలకు మరింత సమతుల్యమైన ఆట వాతావరణాన్ని అందిస్తుంది. ముఖ్యంగా, పునరుద్ధరించిన ఈ లీగ్‌ను 2031 వన్డే ప్రపంచ కప్‌నకు నేరుగా క్వాలిఫికేషన్ మార్గంగా ఉపయోగించే అవకాశాన్ని కూడా ఐసీసీ పరిశీలిస్తోంది. ఎన్ని జట్లు అనే దానిపై స్పష్టత లేదు.. వన్డే సూపర్ లీగ్‌ను పునరుద్ధరించాలనే ఐసీసీ ప్రతిపాదనలో ఎన్ని జట్లు పాల్గొంటాయనే దానిపై ఇంకా స్పష్టత లేదు. అయితే, ఈ లీగ్ 2028 నుంచి తిరిగి వచ్చే అవకాశం ఉందిఈ చొరవ 50 ఓవర్ల క్రికెట్‌కు పూర్తిగా ప్రత్యామ్నాయం కాకుండా, దానికి బలమైన నిర్మాణాన్ని అందించడం ద్వారా దాని ఔచిత్యాన్ని పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకుందని ఒక అధికార తో తెలిపారు. "సూపర్ లీగ్ 50-ఓవర్ల ఫార్మాట్‌కు కొత్త జీవం పోయడానికి సహాయపడుతుంది. అందుకు సరైన నిర్మాణాన్ని కనుగొనడమే" అని ఒక నిర్వాహకుడు పేర్కొన్నట్లు పేర్కొంది. ఈ చర్చలు జరుగుతున్నప్పటికీ, పాలక మండలి ప్రస్తుతం ప్రపంచ కప్ ఫార్మాట్‌ను 14 జట్లకు మించి విస్తరించడాన్ని పరిశీలించడం లేదు. గత ఎడిషన్లలో కేవలం 10 జట్లు మాత్రమే పాల్గొన్నాయి. వన్డే ప్రపంచ కప్ 2023లో అత్యధిక పరుగులు చేసిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత్, వన్డే ప్రపంచ కప్ 2023లో రన్నరప్‌గా నిలిచింది. గ్రూప్ దశలో అద్భుతంగా ఆడి, నాకౌట్ దశకు అజేయంగా చేరుకుంది. ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన సెమీ-ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌ను 70 పరుగుల తేడాతో ఓడించింది. అయితే, అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో పాట్ కమిన్స్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా చేతిలో జట్టు ఓటమి పాలైంది. ఈ టోర్నమెంట్‌లో అత్యధిక పరుగులు చేసిన తొలి రెండు స్థానాల్లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ నిలిచారు. కోహ్లీ 11 మ్యాచ్‌లలో 95.62 సగటు, 90.32 స్ట్రైక్ రేట్‌తో 765 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు ఉన్నాయి. అతను 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డును కూడా గెలుచుకున్నాడు. రోహిత్ 11 మ్యాచ్‌లలో 54.27 సగటు, 125.95 స్ట్రైక్ రేట్‌తో 597 పరుగులు చేశాడు. అతని పేరిట ఒక సెంచరీ ఉంది.

## సౌతాఫ్రికాతో తొలి టెస్ట్ ధ్రువ్ జురెల్‌కు గ్రీన్ సిగ్నల్




**ముంబై,** దక్షిణాఫ్రికాతో శుక్రవారం నుంచి కోల్‌కతాలో తొలి టెస్ట్ ప్రారంభంకానున్నది. అయితే ఆ టెస్టు మ్యాచ్‌లో మిడిల్ ఆర్డర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ ఆడేది కన్ఫర్మ్ అయ్యింది. డొమెస్టిక్ క్రికెట్‌లో టాప్ ఫామ్‌లో ఉన్న ఆ బ్యాటర్‌కు ఛాన్సు ఇవ్వనున్నట్లు అసిస్టెంట్ కోచ్ రియాన్ టెన్ దోసిచేట్ తెలిపారు. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి స్థానంలో ధ్రువ్ జురెల్‌కు చోటు దక్కే అవకాశం ఉన్నట్లు ఆయన వెల్లడించారు. 24 ఏళ్ల జురెల్ ఇప్పటి వరకు ఇండియా తరపున ఏడు టెస్టులు ఆడాడు. అయితే గత అయిదు ఫస్ట్ క్లాస్ మ్యాచుల్లో నాలుగు సెంచరీలు చేశాడు. ఇటీవల బెంగుళూరులో సౌతాఫ్రికా-ఏతో జరిగిన మ్యాచుల్లోనూ రెండు సెంచరీలు చేశాడు. ప్రధాన వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్ బరిలోకి దిగనున్నాడు. ఈడెన్ గార్డెన్స్‌లో జరిగే మ్యాచ్‌లో రిషబ్ పంత్‌తో పాటు ధ్రువ్ జురెల్ కూడా ఉంటాడని అసిస్టెంట్ కోచ్ టెన్ దోసిచేట్ తెలిపారు. ఇద్దరికీ ఛాన్సు ఇవ్వాలన్న క్లారిటీతో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. కోల్‌కతా టెస్టులో ధ్రువ్, రిషబ్ ఆడకుంటే ఆశ్చర్యమే అవుతుందన్నారు. ఏడాదిన్నర నుంచి అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న జురెల్ .. పరిణితిని ప్రదర్శిస్తున్నాడు. అతను ఆడిన చివరి అయిదు మ్యాచుల్లో 140, 56, 125, 44, 132 , 127 రన్స్ స్కోరు చేశాడు. జురెల్ కేవలం ప్రధాన బ్యాటర్‌గా మాత్రమే బరిలోకి దిగుతాడని, పంత్ కీపింగ్ బాధ్యతలు చేపడుతాడని అసిస్టెంట్ కోచ్ చెప్పాడు.

## గుజరాత్ టీంలో భారీ మార్పులు..




**-ఏకంగా 9మందికి వీడ్కోలు..**

**ముంబై,** 2025 సీజన్‌లో పాయింట్ల పట్టికలో మూడవ స్థానంలో నిలిచి ప్లేఆఫ్‌లకు చేరుకున్న గుజరాత్ టైటాన్స్ జట్టు.. ఐపీఎల్ 2026 వేలానికి ముందు అంటే నవంబర్ 15న జగరబోయే రిటెన్షన్‌కు సిద్ధమైంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, సాయి సుదర్శన్, రషీద్ ఖాన్ జట్టుకు ప్రధానాంశంగా ఉంటారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో, తమ పర్స్ బ్యాలెన్స్‌ను నిర్వహిస్తూనే, జట్టును మరింత బలోపేతం చేయడానికి కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలు ట్రేడ్ పుకార్లు, కొందరు ఆశించినంతగా రాణించని ఆటగాళ్లపై దృష్టి సారించినందున, మినీ-వేలానికి ముందు ఫ్రాంచైజీ కొన్ని సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 2025లో 15 మ్యాచ్‌లలో 50 సగటు, 155.88 స్ట్రైక్ రేట్‌తో 650 పరుగులు చేసి జట్టుకు గుండెకాయలా నిలిచాడు. అతనితో పాటు, సాయి సుదర్శన్ స్థిరమైన ఫామ్, రషీద్ ఖాన్ మ్యాచ్ విన్నింగ్ స్పెల్స్ గుజరాత్ ప్రణాళికల్లో కీలకం. నమ్మదగిన బౌలర్లు మొహమ్మద్ సిరాజ్, కగిసో రబాడాలను కూడా రిటైన్ చేసుకునే అవకాశం ఉందని నివేదికలు సూచిస్తున్నాయి. తద్వారా జీటీ తమ వేలం వ్యూహంలో దేశీయ-విదేశీ ఆటగాళ్ల సమతుల్య మిశ్రమాన్ని కాపాడుకోవాలని చూస్తోంది. గుజరాత్ టైటాన్స్‌కు సంబంధించి ట్రేడ్ విండోలో అనేక చర్చలు జరిగాయి. తమిళనాడు ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్‌ను తిరిగి సొంతగడ్డకు తీసుకురావాలని చెన్నై సూపర్ కింగ్స్ తీవ్ర ఆసక్తి చూపినట్లు నివేదికలు చెబుతున్నాయి. అయితే, ప్లేయర్ స్వాప్, ఆల్-క్యాష్ డీల్‌తో సహా చెన్నై నుంచి వచ్చిన అనేక ఆఫర్‌లను గుజరాత్ తిరస్కరించినట్లు సమాచారం. ప్రస్తుతానికి, సుందర్ గుజరాత్ జట్టులో ముఖ్యమైన భాగంగానే ఉన్నాడు. గుజరాత్ టైటాన్స్ రిటైన్ చేసుకోబోయే, రిలీజ్ చేసే అవకాశం ఉన్న ఆటగాళ్లు (అంచనా).. గుజరాత్ టైటాన్స్ ప్రాబబుల్ రిటైన్డ్ ప్లేయర్స్: శుభమాన్ గిల్, సాయి సుదర్శన్, జోస్ బట్లర్ , రషీద్ ఖాన్, వాషింగ్టన్ సుందర్, మొహమ్మద్. అర్షద్ ఖాన్, సాయి కిషోర్, షారుఖ్ ఖాన్, కగిసో రబడా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్, ఇషాంత్ శర్మ, రాహుల్ తెవాటియా, అనుజ్ రావత్, మహిపాల్ లోమ్రోర్. గుజరాత్ టైటాన్స్ ప్రాబబుల్ రిలీజ్డ్ ప్లేయర్స్: కుసల్ మెండిస్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, దసున్ షనక, గెరాల్డ్ కోయెట్జీ, గుర్నూర్ సింగ్ బ్రార్, కరీం జనత్, కుమార్ కుషాగ్రా, నిశాంత్ సింధు, జయంత్ యాదవ్.

## స్టార్ ఆల్‌రౌండర్ సహా ముగ్గురు అవుట్..!




**-మినీ వేలానికి ముందు విడుదల చేయనున్న ఆర్‌సీబీ..!**

**ముంబై,** రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ 2025 టైటిల్‌ను గెలిచి చరిత్ర సృష్టించింది. తొలిసారిగా టైటిల్‌ను గెలుచుకుంది. విరాట్ కోహ్లీ కెప్టెన్సీలో టైటిల్‌ను గెలిచి చిరకాల కలను సాకారం చేసుకుంది. మళ్లీ ఆ జట్టు ఐపీఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా అడుగుపెట్టనున్నది. ఈ సారి ఆర్‌సీబీ జట్టులో పెద్దగా మార్పులు చేసేందుకు ఇష్టపడడం లేదు. అయితే, రాబోయే సీజన్ వేలానికి ముందు ట్రేడ్ విండో ఓపెన్ అయ్యింది. వేలానికి ఫ్రాంచైజీలు తమ జట్లను బలోపేతం చేసుకునేందుకు అనుమతి ఇచ్చే ఓ స్పెషల్ సిస్టమ్. ఎలాంటి వేలం లేకుండానే ఆటగాళ్లు ఓ జట్టు నుంచి మరో జట్టుకు మారే ఛాన్స్ ఉంటుంది. ఈ క్రమంలోనే ఆర్‌సీబీ పలువురు ఆటగాళ్లను విడుదల చేసే అవకాశం ఉంది. ఈ జాబితాలో ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్ స్టోన్ పేరు వినిపిస్తుంది. ఆర్‌సీబీ ఈ ఆల్‌రౌండర్‌ను విడుదల చేసే ఛాన్స్ ఉంది. ఆర్‌సీబీ అతన్ని రూ. 8.75 కోట్లకు కొనుగోలు చేసింది. గత సీజన్‌లో లివింగ్ స్టోన్ కేవలం 112 మాత్రమే చేశాడు. అంచనాలను అందుకోలేకపోయిన అతన్ని విడుదల చేయాలని ఫ్రాంచైజీ యోచిస్తుంది. ఆర్‌సీబీలో ఇప్పటికే టిమ్ డేవిడ్, జితేష్ శర్మ, రొమిరియో షెప్పర్డ్, జాకబ్ బెథెల్, కృనాల్ పాండ్యాతో మిడిలార్డర్ బలంగా ఉంది. దాంతో లివింగ్‌స్టోన్‌ను తప్పించే ఛాన్స్ ఉంది. అదే సమయంలో ఫాస్ట్ బౌలింగ్ విభాగంలో జోష్ హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్ కలిసి 39 వికెట్ల పడగొట్టి అద్భుతంగా రాణించారు. యష్ దయాల్, రసిక్ సలామ్‌లను విడుదల చేసే అవకాశం ఉంది. టోర్నీ చివరలో యష్ దయాల్ ఫామ్ తగ్గడంతో పాటు ఆఫ్ ఫీల్డ్ వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఇక రసిక్ సలామ్‌ను రూ. 6కోట్లకు కొనుగోలు చేసినా.. కేవలం రెండు మ్యాచులు మాత్రమే ఆడాడు. ప్రత్యేకంగా తన ప్రభావాన్ని చూపించలేకపోయాడు. లివింగ్‌స్టోన్, దయాల్, రసిక్‌లను విడుదల చేస్తే ఆర్‌సీబీకి రూ. 19.75కోట్లు మిగలనుండగా.. ఈ సొమ్మును మినీవేలంలో వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది. ఎవరైనా విదేశీ ఆటగాడు, లేదంటే టీమిండియా రైజింగ్ స్టార్స్‌ను జట్టులోకి తీసుకునేందుకు వీలుంటుందని భావిస్తున్నది. ఇదిలా ఉండగా.. ఆర్‌సీబీ కీలక ఆటగాళ్లను నిలుపుకుంటున్నది. ఇందులో విరాట్ కోహ్లీ, ఫిల్ సాల్ట్ ఓపెనింగ్ జోడీ హిట్ గత సీజన్‌లో అయ్యింది. రజత్ పాటిదార్ కెప్టెన్‌గా జట్టును నటిపించాడు. దేవ్‌దత్ పడిక్కల్ మూడవ స్థానంలో రాణించాడు. జితేశ్ శర్మ, మయాంక్ అగర్వాల్, టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, జాకబ్ బెథెల్, కృనాల్ పాండ్యా, జోష్ హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్, లుంగీ ఎన్గిడి, నువాన్ తుషార, సూర్యశర్మ, స్వస్తిక్ చికారే, స్వప్నిల్ సింగ్, మనోజ్ భాండాంగే ఉన్నారు. లియామ్ లివింగ్‌స్టోన్, యష్ దయాల్, రసిఖ్ సలామ్, మోహిత్ రాఠి, అభినందన్ సింగ్ సింగ్‌ను రిలీజ్ చేసే అవకాశాలున్నాయి.

## నాని 'ది ప్యారడైజ్' సెట్ ఖర్చు చూసి షాక్!




**హైదరాబాద్,** టాలీవుడ్ స్టార్ యాక్టర్ నాని దసరా డైరెక్టర్‌తో ది ప్యారడైజ్ సినిమా చేస్తున్నాడని తెలిసిందే. ఈ మూవీలో మోహన్ బాబు కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఇప్పటికే లాంచ్ చేసిన నాని లుక్‌తోపాటు మోహన్ బాబు పోస్టర్ నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. ది ప్యారడైజ్‌లో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటి సోనాలి కులకర్ణి కీ రోల్ పోషిస్తోంది. సోనాలి కులకర్ణి ఈ చిత్రంలో నాని తల్లిగా కనిపించనుంది.కాగా ది ప్యారడైజ్ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో కొనసాగుతోంది. ఇప్పుడొక ఆసక్తికర వార్త నాని అభిమానుల్లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఇంతకీ విషయమేంటంటే ది ప్యారడైజ్ కోసం హైదరాబాద్‌లో ఏకంగా రూ. 7.5 కోట్లతో హౌస్ సెట్ వేస్తున్నారట. ఫలక్‌నుమా ప్యాలెస్‌ను గుర్తుకుతెచ్చేలా ఉండబోతున్న ఈ ఇంటిని అల్యూమినియం ఫ్యాక్టరీలో నిర్మిస్తున్నారని ఇన్‌సైడ్ టాక్. ఈ వార్తతో నాని టీం ఈ సారి ఏదో పెద్ద ప్లానే వేసిందని తెగ చర్చించుకుంటున్నారు. ఇక డిసెంబర్ చివరికల్లా లేదా జనవరి మొదట్లో ఈ మూవీ నుంచి మరో గ్లింప్స్ లాంచ్ చేసేందుకు సన్నాహాలు చేస్తుందట. మరి దీనిపై రాబోయే రోజుల్లో మేకర్స్ ఏదైనా క్లారిటీ ఇస్తారేమో చూడాలి. ఈ మూవీలో కిల్ ఫేం రాఘవ్ జుయల్ కీలక పాత్రలో నటిస్తున్నాడు.ఈ మూవీని ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌లో దసరా ఫేం సుధాకర్ చెరుకూరి తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఓ వైపు బ్లాక్ బస్టర్ దసరా కాంబో రిపీట్ అవడం, మరోవైపు జెర్సీ, గ్యాంగ్ లీడర్ తర్వాత నాని-అనిరుధ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో ది ప్యారడైజ్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి.

## 'శివ' రీ రిలీజ్...




**-నాగ్, వర్మతో సందీప్ రెడ్డి వంగా చిట్‌చాట్...**

**హైదరాబాద్,నవంబర్12** అక్కినేని నాగార్జున, దర్శకుడు రామ్ గోపాల్ వర్మకాంబినేషన్‌లో వచ్చిన ఐకానిక్ చిత్రం శివ మళ్లీ రీ రిలీజ్ కాబోతున్న విషయం తెలిసిందే. 36 ఏళ్ల తర్వాత ఈ సినిమాను నవంబర్ 14న మళ్లీ విడుదల చేస్తున్నారు అన్నపూర్ణ స్టూడియోస్. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటుంది చిత్రయూనిట్. తాజాగా ఈ సినిమా విషయాలను పంచుకుంటూ దర్శకుడు సందీప్ రెడ్డి వంగాతో కలిసి ఒక వీడియోను విడుదల చేసింది. ఈ వీడియోను మీరూ చూసేయండి.

## ఆ సినిమాలపై ఇంకా బాధపడుతున్నా...



**-పవన్ హీరోయిన్ స్టన్నింగ్ కామెంట్స్...**

**హైదరాబాద్,** అమెరికాలో పుట్టి పెరిగిన టాలెంటెడ్ బ్యూటీ అను ఇమ్మాన్యుయేల్ చిన్న వయసులోనే సినిమాలపై ఆసక్తి పెంచుకుని, స్వప్న సంచారి అనే మలయాళ చిత్రంలో బాలనటిగా తొలి అడుగు వేసింది. ఆ తర్వాత యాక్షన్ హీరో బిజు ద్వారా కథానాయికగా పరిచయమై, తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించింది. కొద్ది కాలంలోనే తెలుగు పరిశ్రమలోకి అడుగు పెట్టి మజ్నుతో టాలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. సహజమైన నటనతో, మెరిసే అందంతో అను మంచి గుర్తింపు తెచ్చుకుంది. తర్వాత ఆక్సిజన్, అజ్ఞాతవాసి, శైలజా రెడ్డి అల్లుడు, గీత గోవిందం, అల్లుడు అదుర్స్, రావణాసుర వంటి సినిమాల ద్వారా పలకరించింది.అయితే కొంతకాలంగా అను పెద్దగా కనిపించలేదు. తాజాగా రష్మిక మందన్నాతో కలిసి నటించిన ది గర్ల్‌ఫ్రెండ్ చిత్రంతో మళ్లీ తెరపైకి వచ్చి, కీలక పాత్రలో మెప్పించింది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన అను, తన కెరీర్ గురించి స్పష్టంగా చెప్పింది. "ఇకపై రొటీన్ కమర్షియల్ సినిమాలు చేయాలనే ఆలోచన లేదు. అవకాశాల కోసం ఆరాటపడే తత్వం నాది కాదు. నాకు సంతృప్తినిచ్చే, బలమైన పాత్రలతో కూడిన సినిమాలే చేయాలనుకుంటున్నాను" అని అను పేర్కొంది. హాలీవుడ్ సినిమాలను ఉదహరిస్తూ, అక్కడ హీరో, హీరోయిన్, విలన్ అనే విభజన ఉండదు. ప్రతి పాత్రకీ కథలో ప్రాధాన్యం ఉంటుంది. ది గర్ల్‌ఫ్రెండ్‌లో కూడా రాహుల్ రవీంద్రన్ అదే ప్రయత్నం చేశారు. థియేటర్లో మహిళా పాత్రలకు ప్రేక్షకులు చప్పట్లు కొట్టడం నాకు ఎంతో ఆనందంగా అనిపించింది అని అను చెప్పింది.మహిళలపై సమాజం విధించే షరతులను ప్రస్తావిస్తూ, "ఎలా మాట్లాడాలి, ఎలాంటి దుస్తులు ధరించాలి, ఎప్పుడు పెళ్లి చేసుకోవాలి, పిల్లల్ని ఎప్పుడు కనాలి ఇవన్నీ మహిళలకే. కానీ పురుషులకు మాత్రం అలాంటి ఆంక్షలు ఉండవు. ఇది మారాల్సిన సమయం" అని ఆవేదన వ్యక్తం చేసింది. నా సినీ ప్రయాణం పట్ల కొంత అసంతృప్తి ఉన్నా, నటిగా మాత్రం సంతృప్తి ఉంది. పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్, నాని, నాగ చైతన్య, కార్తి, శివ కార్తికేయన్ వంటి స్టార్ హీరోలతో పని చేసే అవకాశం దక్కింది. కానీ కొన్ని సినిమాలు చేయకపోయి ఉంటే బాగుండేమో అని ఇప్పుడు అనిపిస్తుంది" అని అను పేర్కొంది. ప్రస్తుతం కొత్త కాన్సెప్ట్‌లతో కూడిన కథలు వింటున్నానని, వాటిలో ఒక ప్రాజెక్ట్ ఇప్పటికే ఫైనల్ అయిందని, వివరాలు త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలిపింది.

## 'పెద్ది'తో హైలైట్ అవుతున్న బుచ్చిబాబు




**-చరణ్ సినిమాలో చిరంజీవి హీరోయిన్!**

**హైదరాబాద్,** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం తన కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన చిత్రం 'పెద్ది' తో బిజీగా ఉన్నాడు. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం టాలీవుడ్‌లోనే కాదు, పాన్ ఇండియా స్థాయిలో కూడా భారీ అంచనాలను రేపుతోంది. 'మగధీర', 'రంగస్థలం', 'ఆర్‌ఆర్‌ఆర్' వంటి విభిన్న కాన్సెప్ట్‌లతో ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసిన రామ్ చరణ్, ఇప్పుడు 'పెద్ది'తో మరోసారి తన నటనలో కొత్త ఎత్తులను చేరబోతున్నాడు. ఈ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. 'దేవర'తో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న జాన్వీకి ఇది రెండో తెలుగు సినిమా కాగా, ఆమె పాత్ర ఈ కథలో కీలకంగా నిలవనుంది.భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్‌కు కీలక ఫైనాన్షియర్ సతీష్ కిలారు తన తొలి ప్రొడక్షన్‌గా తెరకెక్కిస్తున్నారు. గ్రామీణ నేపథ్యం, భావోద్వేగాలు, క్రీడల మేళవింపుతో ఈ సినిమా టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌గా నిలుస్తోంది.ఇటీవల విడుదలైన "చికిరి చికిరి" పాటతో సినిమా హైప్ మరింత పెరిగింది. ఏఆర్ రెహమాన్ స్వరపరిచిన ఈ పాటలో రామ్ చరణ్ స్టైలిష్ లుక్‌తో పాటు మాస్ డ్యాన్స్ స్టెప్స్‌తో అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నాడు. యూట్యూబ్‌లో గంటల్లోనే మిలియన్ల వ్యూస్‌ను సాధించి మ్యూజికల్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది.తాజా సమాచారం ప్రకారం, సీనియర్ నటి శోభన కూడా ఈ సినిమాలో ఓ ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. గతేడాది 'కల్కి 2898 ఏడీ'తో రీ-ఎంట్రీ ఇచ్చిన శోభన, ఈ సినిమాలో భావోద్వేగభరితమైన కీలక పాత్రలో మెప్పించబోతున్నారు. ఆమె పాత్ర కథలో ప్రధాన మలుపు తీసుకువస్తుందని, సినిమా ఎమోషనల్ డెప్త్‌ను పెంచుతుందని సమాచారం. 'పెద్ది' కథ ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగుతుందని, రామ్ చరణ్ ఇందులో ఒక క్రీడాకారుడి పాత్రలో కనిపించనున్నాడు. బుచ్చిబాబు ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఈ పాత్ర చరణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ కూడా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న గ్రాండ్ రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

Edited, Published & Owned by **BHUPATHI SANTHOSH.** Printed at PARAHUSHAR PRINTING PUBLICATIONS, H. NO. 1-6-27/2,SRI NAGAR COLONY, MAHABUBABAD, WARANGAL, TELANGANA-506101.Published at Jammikunta, karimnagar,Telangana-505122. EDITOR: BHUPATHI SANTHOSH. Cell: 9247819181 | **RNI No: TGTEL/25/A1882,**Email:Mana vaartha tg. Daily@gmail.com